# నేను నా బడశాలి మా పిల్లనాకొద్దు

## కథలు




వేంపల్లి రెడ్డి నాగరాజు

# నేను నాజూశాలి మాపిల్లనాకొద్దు


## కథలు

**వేంపల్లి రెడ్డినాగరాజు**



ప్రచురణ

**మహతీకృష్ణ సాహితీ ప్రచురణలు**





| | | |
|---|---|---|
| ముద్రణ | : | **ఆగస్టు 2014** |



| | | |
|---|---|---|
| రచయిత చిరునామా | : | **వేంపల్లి రెడ్డినాగరాజు,**<br>**ఎల్.ఐ.సి.ఆఫ్ ఇండియా,**<br>**రాయదుర్గం – అనంతపురం(జిల్లా)– 515865**<br>**మొబైల్ : 9985612167** |
| E-mail | : | srichakravempalli@gmail.com,<br>vr.nagaraju@licindia.com |
| F-book ID | : | VEMPALLI REDDINAGARAJU |





| | | |
|---|---|---|
| సర్వహక్కులు | : | **రచయితవి.** |



| | | |
|---|---|---|
| పేజీలు | : | **52** |
| వెల | : | |
| ప్రతులకు | : | **శ్రీమతి వేంపల్లి నాగశైలజ,**<br>**మార్కండేయ కాంప్లెక్స్,**<br>**10–2–30–1/1, లక్ష్మీ బజార్,**<br>**రాయదుర్గం(పోస్ట్), అనంతపురం. (జిల్లా).** |
| ముఖచిత్రం | : | **ప్రఖ్యాత చిత్రకారుడు శ్రీ 'బ్నిం' గారు** |
| అట్ట వెనుక ఛాయాచిత్రం | : | **ప్రసిద్ధ చిత్రకారుడు శ్రీ ఎస్.వి. రామశాస్త్రి గారు** |
| కవర్ డిజైన్ & సెట్టింగ్ | : | **ఎం.గిరివర్మ, తిరుపతి.** |
| ప్రింటర్స్ | : | **విజయవాణి ప్రింటర్స్ – చౌడేపల్లి** |

# అంకితం

నా ఇష్ట దైవాలు

**అన్నవరం శ్రీ సత్యనారాయణస్వామి, సద్గురు శ్రీ షిర్డీ సాయిబాబాలకు భక్తితో...**

---

ప్రేమతో...

**మా అమ్మ**



**శ్రీమతి పద్మావతమ్మకు**

**నా ఇల్లాలు**



**శ్రీమతి నాగ శైలజకు**

---

**నేను కన్నవాళ్లకీ**



**తేజశ్రీ**



**వైష్ణవి**




**మహతీకృష్ణ**

---

అనురాగంతో...

**మా అక్క**



"కంటేనే అమ్మ అని అంటే ఎలా? కరుణించిన ప్రతి దేవత అమ్మే కదా" అన్న ఓ సినీ కవి అక్షరాలకు నిలువెత్తు సాక్ష్యం కీ.శే. శ్రీమతి సూళగిరి విజయలక్ష్మి గారికి

# కృతజ్ఞతలు

- k మీ కథలు నేటి యాంత్రిక జీవితంలో భరించరాని ఒత్తిడిని సైతం పారద్రోలి పెదాలపై చిరునవ్వులు పూయించేలా వుంటాయన్న వాళ్ళకీ
- k గత పాతికేళ్ళుగా నా కవితల్నీ, కథల్నీ ప్రచురించిన ఆంధ్రజ్యోతి, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, సూర్య, విశాలాంధ్ర, ప్రజాశక్తి, చిత్ర తదితర దిన, వార, మాస, త్రైమాసిక, ప్రత్యేక వార్షిక సంచికల యాజమాన్యాలకీ, సంపాదకులకీ, ఇంకా ఎన్నెన్నో పత్రికల యాజమాన్యాలకీ
- k అప్పుడప్పుడూ మాత్రమే కాక అలవాటుగా రాయకుంటే బాగుండదని అభిమానంతో కోపగించుకున్నవాళ్ళకీ
- k గతంలో నా కవితల్ని, కథానికల్నీ ప్రసారం చేసిన కడప, అనంతపురం, మార్కాపురం ఆకాశవాణి కేంద్రాలకూ
- k ప్రత్యేకించి ధీమాతో బ్రతికే ఉద్యోగం ఇచ్చిన 'భారతీయ జీవిత బీమా సంస్థ' కీ, నా సేవల్ని గుర్తించి ఇప్పటికి మూడు పదోన్నతులు పొందేలా సహకరించిన వాళ్ళకీ, అధికార, అనధికార ప్రముఖులకీ, యూనియన్ నేతలకీ, సహచర ఉద్యోగులకీ, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, పాలసీదారులకీ
- k గతంలో నేను వెలువరించిన 'మట్టివాసన' కవితా సంపుటిని, 'నిచ్చెనమెట్లు' కథల సంపుటిని, 'బొమ్మలు చెప్పని కమ్మని కథలు' (బాల సాహిత్యం) సంపుటిని, రమణీయ కథలు (సహ సంపాదకత్వం) సంకలనాన్ని ఆదరించి, నన్ను కవిగా, రచయితగా అభిమానించిన వాళ్ళకీ, కొన్ని కథల్ని మిగతా భారతీయ భాషల్లోకి అనువదించినవాళ్ళకీ
- k అనేక సందర్భాల్లో ఎన్నో వేదికలమీద నా కవితా గానానికి వీలు కల్పించినవాళ్ళకీ, పురస్కారాలతో సన్మాన, సత్కారాలు చేసినవాళ్ళకీ
- k రెండు దశాబ్దాల క్రితం నాలుగేళ్ళపాటు 'విలేఖరి'గా జర్నలిస్ట్ జీవితం గడిపే అవకాశం ఇచ్చిన ప్రముఖ దినపత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఉదయం పత్రికాధిపతులకీ, వివిధ పత్రికల్లో అనేక హోదాల్లో పనిచేస్తున్న వందలాదిమంది జర్నలిస్టు మిత్రులకీ,
- k పెన్ను పట్టిన ప్రతిసారీ నా వెన్ను తట్టి ప్రోత్సహించే ఎల్.ఐ.సి. సంస్థలోని ప్రముఖులకీ, మిత్రబృందానికీ, ముఖ్యంగా ఫేస్ బుక్‌లోని వివిధ గ్రూపుల

నిర్వాహకులకీ, నా గ్రూప్ లోని దేశ, విదేశాలనందున్న ముఖపుస్తక మిత్రులకీ, లైక్ చేసి, కామెంట్లు పెట్టిన వేలాదిమందికీ

- k కథల సంపుటికి అందమైన ముఖచిత్రాన్ని గీసిన చెయ్యి తిరిగిన ప్రముఖ చిత్రకారుడు శ్రీ 'బ్నిం' గారికీ
- k నా ఫోటోను బొమ్మగా గీసిన మరో ప్రముఖ చిత్రకారుడు శ్రీ సంకిస వేంకట రామశాస్త్రి గారికీ
- k నాకు నాలుగు అక్షరం ముక్కలు నేర్పించిన సంబేపల్లె (కడప జిల్లా), ములకలచెరువు, మదనపల్లి (చిత్తూరు జిల్లా) పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయ బృందానికీ, అప్పటి సహచర విద్యార్థినీ, విద్యార్థులకీ, ఇప్పటికీ స్నేహం కొనసాగిస్తున్న కొంతమంది మిత్రులకీ
- k ఈ కథలన్నీ పుస్తకంగా అచ్చు వేయించమని పదే పదే పోరు పెట్టినవాళ్ళకీ, మరిన్ని పుస్తకాలు వెలువరించాలని కోరుతున్నవాళ్ళకీ
- k నా పిల్లలు వి.ఆర్.తేజశ్రీ (శుశృత ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజ్–బెంగుళూర్), వి.ఆర్.వైష్ణవి, వి.ఆర్. మహతీ కృష్ణ (శబరి హైస్కూల్ – రాయదుర్గం ) యాజమాన్య, అధ్యాపక, ఉపాధ్యాయ బృందానికీ
- k సాహితీపరంగా నా ప్రతి ప్రయత్నాన్ని ప్రశంసించే 'రాయచోటి రాజు విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు' గారికీ
- k ముఖ్యంగా ఈ కథలన్నీ అచ్చులో పుస్తకంగా రావడానికి కొంతమేర ఆర్థికంగా, హార్ధికంగా సహకరించి అభినందనలు తెలియజేసినవాళ్ళకీ
- k ప్రతి కథనీ చదివి, ఆస్వాదించి అభిమానంతో నా ప్రయత్నాన్ని హర్షించి, నిర్మొహ మాటంగా అభిప్రాయాన్ని వర్షించే మీకు కూడా..................

మీ

**వేంపల్లి రెడ్డినాగరాజు**

# కథల వరుస


| | | | |
|---|---|---|---|
| 1) | నవరసాలు | – | 1 |
| 2) | నెమలి కథ | – | 5 |
| 3) | హిందీ కథ | – | 8 |
| 4) | రెకమండేషన్ | – | 11 |
| 5) | చొప్పదంటు ప్రశ్నలు | – | 14 |
| 6) | ఓట్లు–కోట్లు | – | 18 |
| 7) | సాములోరిపూజ | – | 21 |
| 8) | బిరియానీ | – | 24 |
| 9) | మందు | – | 27 |
| 10) | ఋణం | – | 30 |
| 11) | టెక్నిక్ | – | 33 |
| 12) | అత్తా– కో(డ)ళ్ళ కథ | – | 36 |
| 13) | స్వర్గం | – | 39 |
| 14) | రెడ్డి తాత కథ | – | 42 |

# నవరసాలు

"నాయినా రేపట్నుండీ నేను ఇస్కూలుకు పోను" అనె మా పిల్ల నాకొడుకు ఈ దినం బడి నుండీ ఇంటికొస్తానే.

"ఏంటికిరా" అనడిగితి.

"మేడం నన్ను కొట్టి ఎండలో నిలబెట్టింది" అని చెప్పె వాడు.

"ఎవురాయమ్మ?" అని మల్లా అడిగితి.

"ఉమా మేడం" అని చెప్పె.

"ఆ ఐవారమ్మ చానా మంచిదే, నేను ఎబ్బుడు బడి కాడికి వొచ్చినా నగుతా మాట్లాడుతుందే, నిన్ను ఏంటికి కొట్టెబ్బా" అంటి.

"రేపు బడి కాడికి పొయ్యి అడిగిరా, ఏంటికి కొట్టిండేదీ తెలుస్తుంది" అనె నా పెండ్లాం ఇంట్లోనుండీ వొచ్చి.

"వీడు ముందే తులవ నాకొడుకు గదా, ఏంటివన్నా తులవ పనులు చేసినాడేమోలే" అంటి.

"నేనేం తులవ పనులు చెయ్యలా" అనె మా వాడు మొగం రోంత ఎర్రగ బెట్టుకోని రోసంగా.

"అట్లయితే ఏంటికి దెబ్బలు తింటివివాయ్, నాకు మస్తుగా తెలుసులే, నువ్వు చెప్పాకుగానీ, నేనూ చిన్నబ్బుడు నీ మాదిర్తో ఐవార్ల దెగ్గిర దండిగా మెట్టి దెబ్బలు తిన్నోన్నే" అంటి.

"ఆ ఇస్కూల్లో చెప్పిండే టయానికి పీజులు కట్టని పిల్లోల్లను బయట నిలబెడతారంటబ్బా, మన పక్కింటోల్ల పాపనూ నిలబెట్టినారంట, నువ్వు మనోని పీజు కడితివా లేదా?" అనె ఆయమ్మి.

"జీతం తీసుకుంటానే నిన్న నెల్లోనే అంతా కట్టేసినానే, ఇందో చూడు" అంటా జోబీలో నుండీ రశీదులు తీసి చూపిస్తి.

" ఇంగేంటికిబ్బా కొట్టి బయట నిలబెట్టిండేది, వూరికే ఎవురూ కొట్టరే, ఆయమ్మకేమన్నా మనోని మింద కశా, వొగతూరి పొయ్యి అడిగిరా" అనె.

"రేపు పోతాలే" అంటి.

"మీ నాయిన రేపు నీ ఎనకంబడీ బడికాడికొచ్చి అడుగుతాడ్లేగనీ, నువ్వు రా నాయినా మొగం కడుక్కోని, రోన్ని పాలు తాగి వోమర్కు చేసుకుందూవు" అని పిల్చె వాల్లమ్మ వాన్ని.

"వోమర్కా వొద్దు, గీమర్కా వొద్దు పోమ్మా, నేనేం ఇస్కూలుకు పోను" అంటా వాడు బుక్కుల సంచి దూరంగా ఇసిరికొట్టె మూలకు బడేటట్లు.

"ఏం వాయ్, కొవ్వెక్కినట్లుందే, మట్టసంగా వుండు, ల్యాకుంటే కరిగిస్తా" అని కొంచిం కోపంగా కసురుకుంటి.

"పిల్లోడు గదబ్బా, మెల్లిగా చెప్పల్ల, అట్ల కోపగించుకుంటే ఎట్ల చెప్పు?" అనె నా పెండ్లాం.

"వాన్ని గాదు అనేది, ముందు నిన్ను బూడ్సుతో కొట్టల్ల, నీ సపోర్టు జూసుకోనే వాడిట్ల తయారయితాండేది" అంటి.

"గొమ్ముమంటే వూరికే మిందిమిందికొస్తాండావే, ఎట్లుండాది, తెల్లార్తో యా పక్క నిద్దర లేసిండావో గెమనం తెచ్చుకో" అనె ఆయమ్మి.

"చించుకోనుండేది ఇంగ సాల్లే, మూసుకోని లోపలికి పా" అనంటి గుడ్లురుముతా.

"సాలిచ్చు నీ యవారం" అంటా, "నువ్వు రా నాయనా అని" పిల్లోన్ని పిల్చె.

"నేను రాను పోమ్మా" అని ముక్కతా వాడు పొద్దన్నే తొడుక్కోనుండే యూనిఫాం గుడ్డలు గుడా ఇప్పకుండా అట్లనే మంచం మింద పొణుకుండె.

దాంతో నాకు ఇంగా కోపం వొచ్చి "మరేదగా లై వాయ్, ఎన్నితూర్లు చెప్పల్ల" అని పిర్రల మింద రొండు అంటిస్తి.

"నేను పోనుపో ఆ ఇస్కూలుకు" అంటా వాడు ఆ పక్కకు తిరిగి పొణుకుండె.

"నీ కత ఇట్లగాదుండు" అని ఇంగా నాలుగు పీకేదానికి చెయ్యెత్తితి.

"నువ్వు పోతావా, పోవా ఈన్నుంచి" అని నా బాశాలి సివంగి మాదిరీ అడ్డపడె వాన్ని కొట్టనీకుండా.

"మీ సావు యాడన్నా సావండి నాకేంటిగ్గానీ" అని టీ.వీ. ముందర కుచ్చుంటి వార్తలు చూసేదానికి.

"పొద్దు గూకులూ కింద చెదులు బట్టేదంకా ఆ ముండ నాశినం టీ.వీ. ముందరన్నా, కంప్యూటర్ ముందరన్నా కుచ్చుంటావ్ గానీ పిల్లోల్ల గురించీ, నాగురించీ ఏమన్నా పట్టిచ్చుకుంటాండావా" అనె మల్లా నస మొదులుబెడతా.

"తలకాయ నొస్తాండాది, ఇంగ వొదరగాకుమ్మే, నీ మాదిరీ నేను పల్లా పొగులూ సీరియల్లు సూడలా" అంటి.

“మీ నాయిన మాటలకేం గానీ, నువ్వు లెయ్యి నాయనా నీకు పానీ పూరీ తెప్పిస్తా, తినేసి సదూకుందూ” అనె ఆయమ్మి పిల్లోన్ని న్యాకుగా మాటల్లోకి దింపుతా.

“పానీ పూరీవొద్దు, గీనీ పూరీ వొద్దు నేను ఇస్కూలుకు పోనంటే పోనుమ్మా, నీకు ఎన్నితూర్లు చెప్పల్ల” అనె వాడు ఇంగా మొండిగా.

“అట్లయితే నీకు నాలుగు పందులు పట్టిస్తాలేరా, వాటిని మేపుదూగానీ, ఈ సదువూ, గిదువూ ఏమొద్దు” అంటి.

“పట్టకరా, దినామూ సందకాద ఆపీసు నుండీ వొచ్చినంక నువ్వే మేపుదువు, నాకూ నా బిడ్డలకూ ఏం కర్మ” అనె మల్లా నా పెండ్లాం నన్ను మింగేసే మాదిరీ చూస్తా.

“చెరుకా, చెరుకా బెల్లం పెట్టు అంటే యాడొస్తాదీ, గానిగలో తిప్పి పెనుంలో కాలిస్తేనేగదా, దేవునికైనా దెబ్బే గురువని వూరికే చెప్పినారా” అనంటి.

“ఈ బేవార్సోని మాటలకేంటిగ్గానీ నువ్వు లెయ్యిరా సామీ నీతో యాగలేక నేను సస్తాండా” అని వాన్ని వాల్లమ్మే రట్ట బట్టుకోని ఈడ్చి మంచం మింద నిండీ లేపె.

“బాగ సదువుకోని పెద్దయినంక ‘రాయచోటిలో మీ రాజూ ఇస్కూల్లో’ సదివిండే సన్మోహన్ మాదిర్తో నేనూ కలకటేరు అయితానంటివే, బడికి పోనంటే ఎట్ల, అట్లెబ్బుడూ అనగూడదు” అనె వానితో.

“అట్లయితే నన్ను వేరే బల్లో చేర్పిచ్చండి” అనె వాడు మెల్లిగా గొణగతా.

“సమచ్చరం పరిచ్చలు జరిగేదానికి టయిం ఇంగ రొండు నెల్లేవుంది, ఇబ్బుడు ఎవురు చేర్చుకుంటార్రా వేరే బల్లో“ అని మల్లా వానికి నచ్చజెప్పబట్టె.

“సరే ఆ ఇస్కూలుకే పోతాగానీ సెక్సన్ అన్నా వేరే దానికి మారిపిచ్చండి, ఉమా మేడం వొచ్చే సెక్సన్ కు నేను పోను” అనె వాడు.

“ఆయమ్మ చానా మంచిదంటగదరా, నువ్వేంటికి అట్ల బయపడ తాండావ్? అయినా ఆయమ్మ నిన్నేంటికి కొట్టె?” అనడిగె మెల్లిగా.

“నిన్న మా క్లాసులో వాగో పిల్లోనికి వాగో కొశినీ (ప్రశ్న) జెప్పి ఇండ్లకాడ మీ అమ్మా నాయనలను అడిగి మీరే జవాబులు కనుక్కోని నేర్చుకోని రాండీ అని చెప్పె, ఆ కొశినీలు ఈ దినం అడిగితే నేను జవాబు చెప్పలేకపోతి, అందుకే నన్ను కొట్టి బయట నిలబెట్టె” అంటా చెప్పె వాడు.

“ఇంతకూ నిన్ను ఏం కొశినీకి జవాబు తెలుసుకోని రమ్మనిండె?” అనడిగె నా పెండ్లాం.

"నవ రసాలెన్ని?" అనే కొశినీ అనె వాడు.

"దానికి నువ్వేం చెప్తివీ?" అని మల్లా అడిగె వాల్లమ్మ వాన్ని.

"జవాబుగా 1) మిరియాల రసము 2) టమోట రసము 3) బ్యాడల రసము 4) అలసందల రసము 5) ఉలవ గుగ్గిళ్ళ రసము 6) చింతపండు రసము 7) వోళిగ రసము 8) చెనిగ్గింజల రసము 9) నూగుల రసము అని తొమ్మిది రకాలు చెప్పినా, అది ఇంటానే పిల్లోల్లంతా గెట్టిగా నగిరి, మేడం చింత బరికె తో నాకు పూజ చేసె" అనె వాడు.

"గబ్బు నాకొడకా ఇదేం జవాబురా, ఎవురు చెప్పిరి నవరసాలంటే ఇవి అని?" అనడిగె తిడతా.

"ఎమోమ్మా, రాత్తిరి నాయన్ను అడిగితే నవ అంటే తొమ్మిది, రసము అంటే చారు అని చెప్పినాడమ్మా" అనె వాడు అమాయకంగా.

"నిజమేనా నువ్వు ఇట్ల చెప్పిందేది?" అనెడిగె ఆయమ్మి నాకల్లా మింగేసేటట్లు చూసి పొండ్లు పొటపొటా కొరకతా.

"జవాబు అది కాదా, అయినా నేను తెలుగులో కొంచిం 'వీకు' అని నీకు తెలుసుగదమ్మే" అని లేసి బయిటికి ఎల్లబార్తి ఆడనేవుంటే ఇల్లు తిరిగే పరక్కట్ట ఒల్లు తిరుగుతుందని.

(చాలా వూళ్ళలో చారును రసం అంటారు).

"అవునుమ్మే, ఇంతకూ నవరసాలంటే ఏంటివి?" అనడిగితి రాత్రిపూట అన్నం తినే టయింలో.

"ఆ మాత్రం తెలీదా, 1) నిమ్మకాయి రసం 2) చీనీకాయి రసం 3) కమలాకాయి రసం 4) మామిడికాయి రసం 5) ద్రాచ్చి రసం 6) కరుబూజకాయి రసం 7) అనాసకాయి రసం 8) దానిమ్మకాయి రసం 9) సపోటకాయి రసం" అని చెప్పె.

"ఆయమ్మి చెప్పిందేటివన్నీ కరెక్టో, కాదా మీరే చెప్పండప్పా..."

✡

# నెమలి కథ

"ఏమ్మే, పొద్దు బారెడెక్కిండాది, వాన్ని లేపగూడదా, కొంచింసేపు సదువుకోనీ" అంటి నా పెండ్లాంతో.

"సలికాలం గదా, ఇంగ రోంతసేపు పొణుకోనీలేబ్బా" అనె ఆయమ్మి.

"నోరు మూసుకోని చెప్పిండే పని చెయ్, నువ్వే వాన్ని సగం చెడగొడ తాండావ్" అంటి గదమాయిస్తా.

"అట్లయితే నువ్వే లేపుకోపో" అంటా ఇంట్లేకెల్లిపాయ నా బాశాలి.

"రేయ్, టయిం ఏడు గంటల పొద్దయితాంది, ఇంగా నిగుడుకోనే పొణుకోనేవుండావే, లెయ్ వాయ్" అని మా పిల్ల నాకొడుకు పిర్రల మింద వొగటంటిస్తి.

"ఏం నాయినా" అంటా వాడు కండ్లు నలుపుకుంటా లేసి కుచ్చుండె.

"బడికి పొద్దుగాలేదా, బిరీనా రెడీగా" అంటి.

"కడుపు నొస్తాండాది నాయినా, ఈపొద్దు బడికి పోను" అనె వాడు మంచం మింద నుండీ లెయ్యకుండానే.

"నీ యాక్సన్ సాల్లేవాయ్, ఇట్లా దొంగ కడుపు నొప్పులు పిల్లబ్బుడు మాకూ సానానే వచ్చుండాయ్" అని ఇంగోతూరి కొట్టేదానికి చెయ్యెత్తితి.

"నిజ్జింగానే నాయినా" అంటా వాడు చొక్కా పైకెత్తి కడుపు చూపిచ్చె.

"వుడుకుడుగ్గా రోంత కాపీ తాగి, దొడ్డికి కుచ్చోపో, తగ్గిపోతాది" అని చెప్తి.

"ఏంటికబ్బా వాన్ని అంతగా బలవంతం చేస్తాండావ్, ఈ వొక్కపూట పోకుంటే ఏం పాసిపోతాందీ" అంటా మల్లా వొచ్చె నా పెండ్లాం.

"నేనుగుడా చిన్నబ్బుడు మా వారాది ఐవారికి బయపడి ఆపద్దాలు చెప్పి చానాతూర్లు బడి మానేసిండామ్మే, అందుకనే సదువు రాక సంక నాకిపోతి" అంటి.

"వారాది సార్ గురించి చెప్పు నాయినా" అంటా వొచ్చె నా కూతురు.

దాంతో నా చిన్నబ్బుడు జరిగిండే కత చెప్పబట్టి.

నేను మూడో తరగతి సదివేటబ్బుడు మాకు వారాదయ్య అనే ఎడ్మాస్టర్ వుండె. ఒగతూరి ఆయప్ప "రేయ్, రేపు మన ఇస్కూలుకు ఇనస్పెక్టర్ వొస్తాండాడు, మీరంతా తలకాయలకు సమురు బెట్టుకోని దువ్వుకోని, మంచి గుడ్డలేసుకోని రావల్ల" అనె.

"అట్లనే సా" అంటిమి పిల్లోల్లమంతా.

"ఆ వొచ్చేటోడు మిమ్మల్ను కొశినీలు అడగమంటాడు, అవేంటియో ఈపొద్దే చెప్తాండా, అందురూ నేర్చుకోనిరాండి" అని చెప్పె ఆయప్ప.

"సరే సా" అంటిమి. "పలక మింద రాసుకోని నోటికి నేర్చుకోనిరాండి" అంటా కొన్ని పదాలు చెప్పె.

సందకాడ ఇంటికి పొయ్యేటబ్బుడు తుంపర రాలి నా పలక మిందుండే పదాలన్నీ పాయ.

"మ్మా, సురేసుగానింటికి పొయ్యి పదాలు రాసుకోనొస్తామ్మా" అనడిగితి మాయమ్మను.

"పురుగూ, పుట్రా తిరుగుతాంటాయ్, ఈ మొబ్బులో యాడికీ పోగాకులే" అనె మాయమ్మ.

దాంతో ఏమీ నేర్చుకోకుండానే పొణుకోని నిద్దరబొయ్యి తెల్లార్తోనే లేసి బడికి పోతి.

"రేయ్, నిన్న చెప్పిండేటివన్నీ నేర్చుకోనొచ్చిండారుగదా" అనెడిగె వారాది ఐవారు.

"ఆ సా, నేర్చుకున్యాం" అనిరి కొందురు పిల్లోల్లు.

"యాడడిగితే ఆడ టకీమని జెప్పల్ల" అనె ఆయప్ప.

"చెప్తాం సా" అనిరి పిల్లోల్లు ఇంగోతూరి.

తొమ్మిది గంటల టయింలో ఇనస్పెక్టర్ వొచ్చె.

"నమస్కారం సార్, రాండి" అని ఎడ్మాస్టర్ ఆయప్పను కుర్చీలో కుచ్చునబెట్టె.

"ఏమయ్యా వారాదీ, పిల్లోల్లకు బాగనే చెప్తాండావుగదా?" అనెడిగె.

"ఔ సా" అనె మా ఐవారు నవ్వతా.

"ఏదీ నాలుగు కొశిన్లు అడుగు, ఎట్లజెప్తాండావో తెలుస్తాది" అనె ఇనస్పెక్టరు.

"నాగరాజూ, లెయ్ నాయనా" అని నన్ను లేపె ఐవారు.

ఏమడుగుతాడొ, ఏంపాడో, అని బయపడతా నిలబడుక్కుంటి చేతులు గట్టుకోని.

"సీత నాయిన ఎవుర్రా?" అనెడిగె.

ఏం చెప్పల్లనో తెలీక మెల్లిగా గొణిగితి.

"గెట్టిగా చెప్పు, సార్ కు ఇనపడేటట్లు" అనె గుడ్లురుముతా.

"మంగలోల్ల సుబ్బన్న కూతురు సా" అంటి.

ఆ మాటింటానే "నేను తెలుగు పాటం చెప్పినబ్బుడు వీడు బడికి వొచ్చినట్లులేడు సార్, అని ఇనస్పెక్టర్ కల్లా చూస్తా నవ్వె ఐవారు.

"అట్లైతే ఆ పిల్లోన్నే ఇంగ్లీసు పదాలు అడుగబ్బా" అనె ఆయప్ప రికార్డు చూస్తా.

"సరే 'నెమిల్ను' ఇంగ్లీసులో ఏమంటారో చెప్పు?" అని మల్లా అడిగె ఐవారు.

"తెలీదు సా" అంటి.

"మొన్న చెప్పినా గదా, మరిచిపొయ్యిండావా" అంటా వొచ్చి ఇనస్పెక్టరుకు కనపడకుండా నా జుట్టు పట్టుకోని గెట్టిగా గుంజె దాంతో తలకాయిలో మంటబుట్టి కండ్లల్లో నీల్లు తిరిగె.

"పీకాకు సా" అంటి జుట్టు పీకొద్దని, ఏడుస్తా చెప్తా.

"ఈ మాట ముందే చెప్పింటే సరిపోతాండె గదా, అని నాతో అంటా, చూడు సార్, కరెక్ట్ గా చెప్పిండాడు" అనె ఐవారు ఇనస్పెక్టరు కల్లా చూసి.

నేను ఎట్ల కరెక్ట్ గా చెప్పిండానో నాకేమీ అర్తంగాలా.

"ఆ పిల్లోన్నే మిగతా వాటిల్లో గుడా రొండు కొశెన్లు అడుగు" అని చెప్పె ఆయప్ప.

దాంతో నాకు ఉచ్చలు బాయ.

"ఏమప్పా ఆవుకు కాల్లెన్ని?" అనెడిగె మా సారు నాలుగేల్లు నా కల్లా చూపిస్తా, రికార్డు చూస్తాండే ఇనస్పెక్టర్ కు కనపడకుండా.

"నాలుగు సా" అంటి గెట్టిగా.

"మన ప్రదాన మంత్రి చెన్నారెడ్డి కాదు గదా" అనె సారే తలకాయ అడ్డంగా వూపతా.

"కాదు సా" అని చెప్తి, ఐవారి సైగ అర్తంజేసుకోని.

"వెరీ గుడ్డయ్యా, బాగ చెప్తాండావ్" అని మెచ్చుకోని బయలుదేరె వొచ్చిండేటోడు.

"అదీమ్మా మా వారాది ఐవారి కత" అంటా ముగిస్తి.

ఆ కత ఇంటానే మాయమ్మి పడి పడీ కిల కిలా నగె.

✡

# హిందీ కథ

"ఏమప్పా ఈపొద్దన్నా కొంపకు బిరీనా వొొచ్చేదుండాదా లేదా?" అనె నా పెండ్లాం పొద్దున్నే ఆపీసుకు ఎల్లబార్తాండే నాతో.

"సందకాడనే ఇంటికొచ్చి ఏం చెయ్యల్లమ్మే?" అంటి మెల్లిగా.

"కజ్జికాయలూ, అప్పచ్చులూ చేస్తాండా వొొచ్చితింటావేమోనని" అనె గుడ్లురుముతా.

"అట్లయితే ఈ దినం ఆపీసుకు పొయ్యేదెందుకులేమ్మే, శెలవ పెట్టేస్తాగానీ" అంటి నవ్వతానే.

"పొండ్లన్నీ కనిపించేటట్లు మల్ల నగుదూగానీ, సావాసకోపులతో తిరగడాలు సాలిచ్చి సందకాడ బిరీనా కొంపకు రా" అని మల్లా అనె.

"ఏం పనో చెప్తేకదా?" అనడిగితి.

"పిల్లోనికి నాలుగు అచ్చరమ్ముక్కలు నేరిపిస్తావని" అనె.

"అట్లనా, అయినా వానికి నేరిపిచ్చేదేందిమ్మే, మార్కులు దండిగానే వొొస్తాండాయిగదా" అని అంటి.

"ఆ వొొచ్చిండాయి, బండిదొల్లడు" అనె చేతులు తిప్పుతా సాగదీసి.

"బాగనే సదువుతాండెనే, అయినా దేంట్లో తగ్గిండాయి?" అనడిగితి.

"ఇస్కూల్లో మొన్న పోగ్రెస్స్ కార్డు ఇచ్చిండారు, 'ఇందీ'లో మార్కులు శానా అద్దుమానంగా వొొచ్చిండాయి" అని చెప్పె.

"ఎన్నొచ్చినాయి?" అని అడిగితి.

"రొండు" అనె ఏల్లు సూపిస్తా.

అంత అద్దుమానంగా వొొచ్చుండాయా?, అట్లయితే ఇస్కూలు కాడికి పొయ్యి మా వానికి 'ఇందీ' రోంత బాగ చెప్పమని వాల్ల ఐవారమ్మతో చెప్తాలే" అంటి.

" వాల్లకు చెప్తా, వీల్లకు చెప్తా అనే మాటలు సాలుగానీ, బిరిక్కిన కొంపకు చేరుకో" అనె ఇంగ మాట్లాడేదేం లేనట్లు.

తప్పేదేముండాదని ఆపీసు ఐపోగానే ఆరు గంటలకే ఇంటికి చేరుకుంటి.

ఆ టయానికే నా బాశాలి మా పిల్లోన్ని కుచ్చోబెట్టుకోని పలకలో ఏంటియో రాపిస్తావుండె.

"చెప్పిండేది చెవల్లో ఏసుకోని ఎట్లనో బిరీనానే వొొచ్చేసినావే, వీనికి ఇందీ రాసేదీ, సదివేదీ నేరిపిచ్చు" అనె.

“మ్మే, నువ్వు అంటాండే ‘ఇందీ’ తప్ప ఇంగేందన్నా చెప్పు నేరిపిస్తా” అంటి.

“ఇదేందమ్మా ఇడ్డూరం, వానికి రాందేదో చెప్పల్లగానీ, వేరేదేందో చెప్తానంటాండావే, వాడు బాగుపడ్డం నీకిస్టంలేదులే” అని రాగం మొదులుబెట్టె.

“అదిగాదుమ్మే, నాకు నిజంగానే ఇందీ రాదు” అని చెప్తి.

“అట్లయితే పదో తరగతి పొస్టు కలాసులో ఎట్ల పాసయితివి?” అనె ‘లా’ పాయింటు లేవదీస్తా.

“అబ్బుడేందోలేబ్బా, ఇందీ పరీచ్చకు కాపీలు కొట్టిండాగానీ” అని మెల్లిగా గొణిగితి.

“నీకు పిల్లోని మింద అక్కర లేదులేబ్బా, ఇన్ని మాటలెందుగ్గానీ” అని నిస్టూరానికి దిగె నా బాశాలి.

“నన్ను నమ్ముమ్మే, నీ సాచ్చిగా నాకు ఇందీ రాదు” అని చెప్తి నెత్తిన చెయ్యి పెట్టుకుంటా.

“ఎందుకురాదబ్బా?” అనడిగె .

“అది పెద్ద కతలేబ్బా” అంటి నిట్టూరుస్తా.

“ఏంది నాయినా ఆ కత, నాకూ చెప్పు” అనె మావాడు రాస్తాండే పలక పక్కనబెట్టి.

దాంతో నా చిన్నబ్బుడు జరిగిండే సంగతి గుర్తొచ్చె.ఆ కత చెప్పబడ్తి.

నేను మదనపల్లిలో ఎనిమిదో తరగతి సదవతాన్నెప్పుడు మాకు నారాయనరెడ్డి అనే ఇందీ ఐవారుండె. ఒగదినం మద్యానం పూట ఆయప్ప క్లాసులోకొచ్చి “ఏం రా చెప్పిండేటివన్నీ నేర్చుకున్యారా?” అనడిగె.

“ఊ సార్, నేర్చుకున్యాం” అనిరి పిల్లోల్లందరూ.

“అట్లయితే ప్రెశ్నలడిగేదా?” అనె ఐవారు.

“అడగండి సా” అనిరి ముందర బేంచీల్లో వుండే పిల్లోల్లు.

“నువ్వు లెయ్యిరా” అని నాకల్లా ఏలు బెట్టి సూపిస్తా నన్ను లేపె ఆయప్ప.

“చెప్పండి సా” అంటా చేతులు కట్టుకోని లేసి నిలబడితి.

“తుమ్మొస్తే ఏమొస్తుందిరా?” అనెడిగె సారు.

తడుముకోకుండా ఆడపిల్లోల్లకల్లా చూస్తా“ చీమిడొస్తుంది సార్” అంటి టకీమని.

దానికి పిల్లోల్లంతా గెట్టిగా నవ్వేసిరి. వాల్లెందుకు నవ్విండారో అర్థం గాలా. ఈ లోగా ఐవారు నా దెగ్గిరికొచ్చి కోపంతో జుట్టుపట్టి ఈడ్చీడ్చి

పిడిగుద్దులు గుద్దె. అబ్బుడికీ ఆయప్ప కోపం సల్లారక ఈత బరిగెతో నా వొల్లంతా వాతలు తేలేటట్లు పెరికె.

ఆ దెబ్బలు తట్టుకోలేక గెట్టిగా ఏడ్చేస్తి "ఇప్పుడొచ్చింది సూద్రా కొడకా నీకు ముక్కల్లో చీమిడి" అంటా ఐవారు బరబరా బైటికి ఎల్లిపాయ.

నేను ఏడుస్తావుంటే "నీకు ఐవార్లతో జోకులేమిటికిరా" అనె నా సావాసగాడు ఎంగట్రమణ వొంటికిబెల్లు టయింలో.

"జోకులు నేనేమిటికేస్తినిరా? అనడిగితి వాన్ని.

"తుమ్మొస్తే 'హు' గదా వొచ్చేది, నువ్వు చీమిడి అంటే ఐవారికి కాలదా?" అనె వాడు.

"నువ్వు ఏం చెప్తాండావో నాకర్తంగాలారా ఎంగట్రోణా" అంటి ఎగబీలుస్తా.

"తుం కు 'హు' అని, ఆప్ వస్తే 'హై' వొస్తుందని సారు నిన్ననే గదా ఇందీ గ్రామరు చెప్పిండేది" అనె వాడు.

"ఏమో నాకెట్ల తెలుసురా, నిన్న నేను బడికిరాలాగదా" అంటి వానితో.

"అదీ కత, ఇబ్బుడర్తమాయ" అనె వాడు నగుతా.

అప్పట్నుండీనే ఐవారు దెగ్గిర దెబ్బలు తినిండే రోషంతో ఆయప్ప క్లాసులన్నీ ఎగరగొట్టి ఇందీ అచ్చరమ్ముక్క రాకుండాబాయప్పా" అని చెప్తి మా పిల్ల నాకొడుక్కు.

"తుమ్ వొస్తే 'హో' గదా వొచ్చేది" అనె ఈ కతంతా ఇంటాండిన మా రొండో ఆయమ్మి.

"మా క్లాస్‌మేటు రాధ ఈ మాటే చెప్పిండాదిలే, ఎంగట్రోణ గాడు గూడా సరిగ్గా విన్నెట్లు లేదులే" అని చెప్తి.

✡

# రెకమండేషన్

"పిల్లోల్లకు బల్లు తెరిచేదానికి టయిం ఇంగ వారం దినాలే వుండాది, అమ్మికి, అబ్బోనికి గుడ్డలు తీసకరావల్లబ్బా" అనె నా పెండ్లాం నిన్న సందకాడ ఆపీసు నుండీ ఇంటికి వొస్తానే.

"అట్నేలేమ్మే, రేపు ఒగతూరి గెమనం చెయ్, తీసకస్తాంగనీ" అనంటి ప్యాంటు ఇడ్సి లుంగీ కట్టుకుంటా.

"మల్లా రేపుటిదాకా వాయిదా ఏంటిగ్గనీ, ఈ దినమే పోదాం పా తెచ్చేస్తాం" అనె ఆయమ్మి మొగం కడుక్కునేదానికి టవాలు అందిస్తా.

"ఇబ్బుడు కుదర్దులేమ్మే ,రేపు గ్యారంటుగా పోదాం" అని చెప్తి జలదాట్లేకి పోతా.

"రేపు, మాపు అని వాయిదాలేస్తాండావు, ఇబ్బుడేమన్నా ఇంట్లో కుచ్చోని గుడ్లేమన్నా పెట్టల్లనా?" అనె రోంత ఎటకారంగా.

"నా దెగ్గిర ఇబ్బుడు 'లెక్క' లేదు, రేపు ఎవురి దెగ్గిరన్నా చేతి బదులు తీసకస్తా" అనంటి.

"జీతాలు వొచ్చి ఇంగా వారం దినాలుగుడా కాలా, అబ్బుడే లెక్క లేదంటాండావే, ఏంజేస్తివిబ్బా అంతా" అనడిగె అనుమానంగా చూస్తా.

"ఆ, పెట్టుకోనుండేదానికి కొంచిం ఇస్తి, మిగతాది ఇస్పేట్టాకులు ఆడేస్తి" అని చెప్తి కోపంగా.

"నీ మొగానికి అదొగటే తక్కవగనీ ఏం చేసినావో చెప్పు?" అనె నిలదీస్తాన్నెట్లుగా.

"ఈ నెల నింటీ లచ్చ రూపాయల చీటీ ఏస్తాండానని మొన్ననే అన్లేదా, దానికి కడ్తి" అని చెప్తి.

"అట్ల ఇలావరీగా చెప్తేగదా తెలిసేది, పంగమాలిన మాటలన్నీ మాట్లాడితే ఎట్ల" అనె.

"నువ్వు నన్నేం 'ఆడిట్టు' చెయ్యాకుగానీ, నా తంటాలేవో నేను పడతా, పిల్లోల్లకు గుడ్డలు రేపు తెస్తాంలే" అనంటి.

"నాయినా ఈతూరి నాకు జీన్సు ప్యాంట్లు తీసకరా, ఇంగ నాకు నిక్కర్లు వొద్దు" అనె అబ్బుడే ఇంట్లోకొచ్చి మా మాటలు ఇనిండే మా పిల్ల నా కొడుకు.

“జీన్సు ప్యాంట్లు వొద్దు ప్పా, నీకు నిక్కర్లే చానా బాగుంటాయి” అని చెప్తి వానికి.

“జీన్సు ప్యాంట్లు అయితే లెక్క దండిగా అయితాదని అట్ల చెప్తాండాడు లేరాప్పా మీ నాయిన” అని నా బాశాలి వానికి ఎగదోసి మంటబెట్టె.

“నువ్వు కిందా పైనా మూసుకోని గొమ్మునా వుండుమ్మే, మెట్టిదెబ్బలేమన్నా పడల్లనా” అని కొంచిం గెట్టిగా కసురుకుంటి.

“నీ ఇస్టం వొచ్చినట్లు చేసుకో, మెట్టి, గిట్టి అనగాకు, నాకేంటిగ్గనీ” అనె ఆయమ్మి.

“నిక్కర్లు తెచ్చేటట్లుగా వుంటే నేను ఇస్కూలుకు పోను” అనె మా పిల్ల నా కొడుకు మూతి నల్లగాపెట్టుకోని అలుగుతా.

“నా మాటినరా, కొంచెం పెద్దోనివి అయినంక రేపు సమచ్చరం తెచ్చిస్తా, పదోతరగతి దంకా నేనుగుడా నిక్కర్లే తొడుక్కుంటాంటి” అని వానికి నచ్చజెప్పే దానికి చూస్తి.

“నేను మటుకు నిక్కర్లతో బడికి పోను, మా క్లాసు పిల్లోల్లంతా ప్యాంట్లే తొడుక్కోనొస్తారు, ఇబ్బుడికే అంతా నన్నుజూసి ఎక్కిరిచ్చి నగుతాండారు” అనె ముక్కులు ఎగబీలుస్తా.

“మాటిమాటికీ బడికి పోనని బెదిరిస్తావేం వాయ్, ఇంగోతూరి అట్లంటే నీకు బూడ్సు దెబ్బలే పడేది, బడికి పోకుంటే పందులు మేపనుపోతావా?” అంటి కొట్టేదానికి చెయ్యెత్తి.

“పుట్టిండేది మగ నా కొడుకు వొగడు, వానిగ్గాక ఇంగెవురికి తీసీయల్లబ్బా” అని వాల్లమ్మ వానికి సపోర్టుగా వొచ్చి అడ్డంబడె కొట్టనీకుండా.

“నీయమ్మ గారింటికాడ్నింటీ ఏందన్నా ‘లిబ్బి’ తీసకచ్చింటే చెప్పు, ఏంగావల్లంటే అదే తీసిస్తా, నీ ముదిగారం చూసుకోనే వాడిట్ల తయారయి తాండేది” అనంటి.

“మాయమ్మగారింటి మాట ఎత్తందే నీకు కూడు, నీల్లు దిగవా, సాలిచ్చు నీ రామాయనం” అనె ఆయమ్మి రోసంగా.

“కొంచిం కాపీ పెట్టీ మ్మే, తలకాయి నొస్తాండాది” అంటి.

“వానికి జీన్సు ప్యాంట్లే తీసీబ్బా, నాకు చీర ఇబ్బుడొద్దు, రేపు నెల్లో తీసుకుంటాగనీ” అని మల్లా రాగం మొదులుబెట్టె.

“నీకు చీర తీసిస్తా అని ఎవురు చెప్పినారుమ్మే, ఇబ్బుడు కొనుక్కో నుండేటివన్నీ ఎలకలకు బెట్టకుండా కట్టుకో సాలు” అంటి.

"అవన్నీ నాకుతెల్దు, వానికి మటుకూ ప్యాంట్లు తీసీ" అనె మూతి ముప్పయ్ సొట్టలు తిప్పి కాపీ లోటా చేతికందిస్తా.

"నాయినా నాకు సందీపు గాడు తొడుక్కుంటాండ్లా, అట్లా ప్యాంట్లే తీసకరా" అనె మావాడు నేను మెత్తబడడం గమనిచ్చి.

"సందీపు గాడు ఎవుర్రా?" అనడిగితి వాన్ని.

"వాడు మా క్లాసోడేలే, వానివి వొగో ప్యాంటు వెయ్యి రూపాయిలంట" అనె గుడ్లు పెద్దవిజేసి యాక్సన్ జేసినట్లు చూపిస్తా.

"వాల్లు పెద్ద సావుకార్లేమోలే, అందుకే అంతంత పెట్టి కొనింటారు, ఔరా వాల్ల నాయిన ఏం పని చేస్తాడు?" అనడిగితి.

"వాల్ల నాయిన, వాల్లమ్మ ఇద్దరూ బ్యాంకీలో ఆపీసర్లంట" అని చెప్పె వాడు.

"అట్లనా, ఏ బ్యాంకీలోనో, యా వూర్లోనో కనుక్కోరా సామీ, నాకు చిన్న పనుండాది, వుజ్జోగస్తులకు లోన్లు ఇస్తాండారంట, రేపు నెల్లో నేనూ తీసుకోవల్ల" అనంటి.

"వాల్లు పని చేసేది ఈ వూర్లోనే నాయనా, వాల్లమ్మ కుక్క బ్యాంకీలో, వాల్ల నాయిన బొక్క బ్యాంకీలో, నీ లోను కోసరం రెకమండేసన్ చెయ్యమని నేను సందీపుగానికి రేపు చెప్తాలే" అనె అట్లయినా జీన్సు ప్యాంట్లు తీసకస్తానని.

"మా పిల్ల నా కొడుకు చెప్పిండే 'కుక్క బ్యాంకీ', 'బొక్క బ్యాంకీ' అంటే ఏంటివో నాకు అర్తంగాలా, మీకేమన్నా తెలిస్తే రోంత చెప్పండప్పా....

✡

# చొప్పదంటు ప్రశ్నలు

“నాయినా, నాయినా” అని పరిగెత్తుకుంటా వొచ్చె మా పిల్ల నాకొడుకు నిన్న తెల్లార్తో జలదాట్లో నీల్లు పోసుకుంటాంటే.

“ఏంటికిరా అట్ల గస పోసుకుంటావొస్తివి?” అనడిగితి సబ్బుతో వొల్లు రుద్దుకుంటా.

“నీ సెల్లు పోను మోగుతాంది, అది చెప్తామనే వొస్తి” అని చెప్పె.

“సరేపా, వస్తాండాగనీ” అంటి చెంబుతో నీల్లు మింద కుమ్మరిచ్చుకుంటా.

“ఇబ్బుడికి రొండుతూర్లు మోగిండాది” అనె వాడు ఆట్నించీ ఎల్లబార కుండానే.

“అట్లనా, ఎవురు చేసినారో చూస్తివ్యా”? అనడిగితి.

“ఆ, చూసినా,” “ప్రెసాద్, ఐద్రాబాద్” అని పడింది పేరు అని చెప్పె.

“సరేపా, మాట్లాడతా” అని ఇంట్లోకొచ్చి ప్రెసాద్‌కు పోన్ చేస్తి.

“ఏం బ్బీ, రొండుతూర్లు చేసినా ఎత్తలేదు, బిజీగా వున్నెట్లుండావే?” అనడిగె ఆయప్ప.

“నీల్లు పోసుకుంటాంటిలేన్నా” అని చెప్తి టవాలుతో  తుడుసుకుంటా.

“రాత్తిరి చానా సేపు మేలుకోనుంటివేమో, ఇంగా నిద్దర లేసిండావో, లేదోఅనుకుంటి” అనె నవ్వతా.

“ఎనిమిది గంటల పొద్దయితాంది, ఇంగా పొణుకుంటే ఎట్లన్నా” అంటి.

“వూరికే అంటిలే, ఏమనుకోగాకు” అనె ఇంగోతూరి నవ్వతా.

“బాగుండావు గదన్నా?, ఆయక్కా, పిల్లోల్లు అంతా ఎట్లుండారు?” అనడిగితి.

“మా వాల్లాంతా బాగుండారుబ్బీ, మీ పెండ్లాం, పిల్లోల్లు బాగుండారు గదా” అనె.

“ఔ న్నా, చాన్నాల్లకు గుర్తొచ్చినట్లుండానే?” అనంటి కొంచిం నిష్టూరంగా.

“నిజమేబ్బీ, సుట్టాలింటికి మీ జిల్లాకే వొచ్చినా, ఈడికి నువ్వుండే వూరు రాయదుర్గం దెగ్గిరేగదా, అది గమనానికొచ్చి పోన్ చేస్తి” అని చెప్పె.

“ఇబ్బుడు నువ్వు యాడుండావున్నా?” అనడిగితి.

“అనంతపురంలో వుండే మా చెల్లెలోల్లింటికి నిన్న సందకాడ వొచ్చినా” అని చెప్పె.

"అట్లయితే మా వూరికి రాగుడదాన్నా, ఎట్లా ఇంత దూరం వొచ్చినావు" అంటి.

"ఇంగోతూరి ఆదివారం పూట ఎబ్బుడన్నా తీరిగ్గా వొచ్చినబ్బుడు గ్యారంటీగా వొస్తాలేబ్బా, ఈ దినం నువ్వు ఆపీసుకు పోవల్లనేమో, నిన్ను ఇబ్బంది పెట్టేదేంటిగ్గనీ" అనె ఆయప్ప.

"వానెక్కా, నువ్వు మా వూరికి వొస్తే అదే బాగ్యంగనీ, ఆపీసుకు ఈపూట శెలవ పెట్టేస్తా, ఇంగేం మాట్లాడకుండా రాన్నా, నీ కోసరం ఎదురు చూస్తాంటా" అని చెప్తి.

"సరేలే, వొచ్చేటట్లయితే మల్లా చెప్తా" అనె.

"ఆ రామాయనాలన్నీ సాలిచ్చున్నా, ఇంగేం మాట్లాడకుండా బస్సెక్కి వొచ్చై, నీకోసరం ఎదురు చూస్తాంటా, పది గంటలకు బస్సుంది చూడు" అని చెప్తి.

"అంతగా బలవంతం చేస్తాండావ్, వస్తాలేబ్బా" అనె ప్రెసాదన్న.

"మ్మే, ఐద్రాబాదు ప్రెసాదన్న వొస్తాండాడు, ఈ పొద్దు ఆపీసుకు పొయ్యేది లేదుగనీ, ఆయప్పకోసరం ఏందన్నా 'స్పెసల్' చెయ్యి అని చెప్తి నా బాశాలికి.

"ఎన్ని గంటలకు వొస్తాడు?" అనెడిగె ఆయమ్మి కాపీ లోటా అందిస్తా.

"మద్యానం అన్నం టయానికి వొచ్చేస్తాడు" అని చెప్తి వుడుకుడుగ్గా వుండేకాపీ వూదుకుంటా తాగుతా.

"కూర ఏం చెయ్యల చికిన్ తెస్తావా, మటన్ తెస్తావా?" అనె.

"అట్టాటివన్నీ ఆయప్ప దినామూ తినేటివేలేమ్మే, రాగిపిండి రోంత ఎక్కువగాఏసి సంగటి గెలికి, కారంకారం వుండేటట్లు గోవాకు వూరిమిండి నూరు, అట్లే ఎఱ్రగడ్లు, పండుమిరగ్గాయలు గుడా వూరిమిండి నూరు, బో ఇస్టంగా తింటాడు" అని చెప్తి.

"కరెంటు గుడా పోతా వొస్తావుండాదిగదబ్బా, బజారుకు బిరీనా పొయ్యి గోవాకు రొండు కట్టలు, మిరక్కాయలు త్యాపో" అనె.

"మ్మే, చెప్పడం మర్చిపోయినా, అట్లా యాడన్నా మిక్సీలో రుబ్బేవు, రోట్లో నూరు, 'బో' రుచిగా వుంటుందని ఆయప్ప నాతో చానాతూర్లు చెప్పినాడు, అట్నే అగ్గి నిప్పుల మింద వంకాయి కాల్చి బజ్జీ గుడా చెయ్యి" అని చెప్తి.

"సరేలే, అట్లనే నూరుతాగనీ" అనె నా బాశాలి.

"నాయినా, ప్రెసాదన్నా ఎవురు?" అనెడిగె మా మాటలు ఇంటాండిన మా పిల్ల నాకొడుకు.

"ఆయప్ప నా ఫ్రెండులేరా" అని చెప్తి.

" వాల్లది యావూరు?" అని మల్లా అడిగె.

"మన కడప జిల్లానే, కలసపాడు, ఇబ్బుడు ఐద్రాబాదులో వుండాడు" అంటి బజారుకు పొయ్యేదానికి చొక్కా తొడుక్కుంటా.

"ఏం పని చేస్తాడు?" అని ఇంగో కొశినీ ఏసె.

"ఆయప్ప "చెయ్యి తిరిగిన రచయిత" అని అంటి.

"అట్లంటే ఏంది?, ఏం చేస్తాడో చెప్తేకదా" అని మల్లా అడిగె.

"మెట్టితో కొడతా, కిందా పైనా మూసుకోని బుక్కెత్తుకోని సదువుకో పోవాయ్, తలకాయి తినగాకు" అని కసురుకుంటి .

"పిల్లోడు గదబ్బా, ఏందన్నా అడిగితే అర్తమయ్యేటట్లు చెప్పల్లగనీ ఈడెగిరి ఆడ దుంకితే ఎట్ల?" అనె నా పెండ్లాం వానికి సపోర్టుగా వస్తా.

"అంతగా అయితే నువ్వే ఇలావరీగా చెప్పు, బిరీనా బజారుకు పొయ్యొస్తా, లేటుగాపోతే మల్లా గోవాకు దొరుకుతుందో లేదో" అని గబగబా ఎల్లబార్తి.

సరిగ్గా వొంటిగంటకాడ ప్రెసాదన్న రాయదుర్గం బస్టాండులో బస్సు దిగె. అవీ, ఇవీ మాట్లాడుకుంటా ఆటోలో ఇంటికి పోతిమి.

"కాల్లూ, మొగం కడుక్కోన్నా, అన్నం తినే టయిం అయ్యింది, రోంత తినేసి మల్లా తీరుబడిగా మాట్లాడుకుందాం" అంటి టవాలు అందిచ్చి జలదాటికల్లా చూపిస్తా.

"కొంచెంసేపిటికి తట్టల ముందు కుచ్చుంటిమి.

"వుడుకుడుకు ముద్దా, గోవాకు వూరిమిండీ, వంకాయి బజ్జీ బలే వుండా యిబ్బా, ఇవి తింటాంటే మల్లా మాయమ్మా, మా పల్లి గెమనానికొస్తాండాయి నాగరాజూ, అని "బో బాగ చేపిచ్చినావు" అంటా ప్రెసాదన్న మెచ్చుకుండె లొట్టలేసుకోని తింటా.

"కొంచింసేపు పొణుకోన్నా, మంచం వాల్చిస్తా" అనడిగితి.

"మద్యానం పొణుకునే అలవాటు లేదులేబ్బా" అని మా పిల్లోన్ని దెగ్గిరికి పిల్చె.

వాడు దెగ్గిరికి పోంగానే ఏం పేరు, ఏం సదువుతాండేదీ, ఏ ఇస్కూలు? అన్నీ అడిగె.

మా వాడు అన్నిటికీ జవాబులు చెప్పంగానే "ఔప్పా వొచ్చినబ్బుట్నుండీ గమనిస్తాండా, నువ్వేంటికి అదే పనిగా నా చెయ్యి కల్లానే చూస్తాండావే?" అనెడిగె అనుమానంగా చూస్తా.

"నీ చొక్కా రట్ట పైకెత్తి వొగతూరి చెయ్యి చూపిచ్చు అంకుల్" అనె మా వాడు పుల్ సర్టు తొడుక్కోనుండే ప్రెసాదన్నతో.

ఆ మాట వింటానే ఈ నాకొడుకు ఏంటికిబ్బా ఆయన్నను ఇట్ల అడిగిండాడు, ఇబ్బుడాయప్ప ఏమనుకుంటాడొ, ఏంపాడో, అనుకుంటా ప్రెసాదన్న కల్లా చూస్తి.

"దేనికి నాయినా?" అనెడిగె ఆయప్ప నగుతా పుల్ షర్టు రట్ట పైకెత్తి చెయ్యి చూపిస్తా.

"మా నాయిన నువ్వేం పని చేస్తావని అడిగితే "చెయ్యి తిరిగిన రచయిత' అని చెప్పిండాడు, నీ చెయ్యి యాడ తిరిగిందో చూస్తామని" అనె వాడు అమాయకంగా మొగం పెట్టి.

ఆ మాట ఇంటానే ఆయన్న గెట్టిగా నవ్వేసె.

ఇట్లా సొప్పదంటు ప్రెశ్నలడిగే మా పిల్ల నాకొడుకుతో ఎట్ల ఏగల్లనో మీరే చెప్పండిప్పా...

✡

# ఓట్లు-కోట్లు

"నాయినా నీకోసరం వొగాయప్ప వొచ్చిపాయ" అనె మాపిల్లనాకొడుకు మద్యానం అన్నం టయింలో ఆపీసు నుండీ ఇంటికి వొస్తానే.

"ఎవుర్రా? " అనడిగితి నాకోసరంఎవురు వొచ్చింటారబ్బా అని ఆలోచిస్తా.

"ఎలకస్సన్లలో నిలబడినాడంట, ఓట్లడిగేదానికి వొచ్చినాడు" అనె వాడు.

"యాపార్టీ అంట?" అనడిగితి,కాల్లూ ,మొగం కడుక్కుంటా.

"తెలుగుదేశమంట, మీ ఇంట్లో ఓట్లన్నీ నాకే ఎయ్యల్ల అనడిగినాడు" అని చెప్పె మా పిల్లోడు.

"ఈ టయింలో వాల్లొచ్చేది మామూలేగనీ అన్నం తింటివ్యా?" అనడిగితి.

"అబ్బుడే తినేస్తి" అని చెప్పె.

"అట్లయితే బుక్కెత్తుకోని సదువుకోరాదా ఎండలకు తిరక్కుండా" అంటి అన్నం తట్ట ముందర కుచ్చుంటా.

"వాడు కొంచింసేపు పొణుకోనీలేబ్బా, సందకాద సదూకుంటాడుగనీ" అనె నా బాశాలి.

"మ్మే, నువ్వు మూసుకోని గొమ్ముకనుండు, నీ సపోర్టు జూసుకోనే వాడు చెడిపోతాండాడు" అంటిగెట్టిగా అరుస్తా.

"నువ్వు గుడ్లురిమిండేది ఇంగసాల్లే, వాడేమన్నా డిగ్రీ సదువుతాండాడా, ఒగటో తరగతికే పల్లాపొగులూ సదవాల్నా?" అనె ఆయమ్మి.

"నీ ఇస్టంలే, రేపు పరీచ్చల్లో గుండు సున్నాలు తెచ్చుకుంటే మెట్టితో కొట్టేది వాన్నిగాదు నిన్నే" అంటి కొంచిం కోపంగానే.

"పరీచ్చలు బాగనేరాస్తాండాడంటలేబ్బా, వాల్ల మేడంచెప్పిందిగనీ" అనె నా బాశాలి.

"నిరుడుతూరి అమ్మిని గూడా ఇట్లనే ఎనకేసుకోనొచ్చి పొస్టుకలాసు మార్కులొస్తాయని చెప్పి నా కొంప కూల్చిండేది సాల్లేదా" అని మల్లా గెట్టిగా అరిస్తి.

"అబ్బుడంటే ఏందోలేబ్బా పేపరు కస్టంగా ఇచ్చినారంటగనీ" అనె తట్టలేకి మజ్జిగ పోస్తా.

"వాన్ని కొంచింసేపు పణుకోనిచ్చి మూడు గంటలకాడ లేపి బుక్కెత్తు కోమను" అని చెప్తి.

"అట్లనే చేస్తాగనీ ఈతూరి మనం ఎవురికి  ఓట్లేసేది?" అనెడిగె ఆయమ్మి.

“ఎవురోవొగరికిలే, ఇంగా రొండు వారాలు టయిం వుందిగనీ ” అంటి చెయ్యి కడుక్కుంటా.

“నాయినా ఎలక్సన్లలో నిలబడితే ఏమొస్తుంది?” అనడిగె మా పిల్లనాకొడుకు మెల్లిగా.

“ఏమొస్తే నీకేంటికిలేవాయ్, పెద్దరికం మాటలు సాలిచ్చు” అంటి.

“ఏంటికిబ్బా వాన్ని అట్ల కసురుకుంటావ్?” తెలీంది అడిగిండాడు, మెల్లిగా చెప్పల్ల” అనె నా బాశాలి మొగంనల్లంగా పెట్టుకోనుండే వాన్ని దెగ్గిరికి తీసుకుంటా.

“నీ ముదిగారం ఇంగ సాలిచ్చు మ్మే, నువ్వొగదానివే వాన్ని నాకేట ట్లుండావే” అంటి ఆపీసుకు ఎల్లబారేదానికి గుడ్డలు తొడుక్కుంటా.

“నువ్వు రేపుట్నుండీ మీ నాయినతో మాట్లాడగాకులేప్పా, కచ్చి సమాచారం మనకేంటిగ్గానీ” అనె.

పిల్లోనికీ నాకూ తంట పెడతాండాదని గమనిచ్చి “రా రా చెప్తా” అని పిలిస్తి.

వాడు పరిగెత్తుకుంటా వొచ్చె.

“ఎలక్సన్లలో నిలబడి గెల్చినోడు ఎమ్మెల్లే అయితాడు” అనిచెప్తి.

“ఎమ్మెల్లే అయితే ?” అనె వాడు అర్తంగానట్లు చూస్తా.

“పెద్ద పెద్ద ఆపీసర్లు, పోలీసోల్లు జనాలంతాగుడా నమస్కారం పెడతారు, ఎమ్మెల్లే అయ్యిండేటోడు యాడికైనా పోవల్లంటే కారుంటుంది” అని ఇలావరీగా చెప్తి.

“మా ఐవార్లు గుడా ఎమ్మెల్లేకి నమస్కారం పెడతారా?” అనెడిగె మల్లా అనుమానంగా.

“ఏంటికీ పెట్టరూ, ఐవార్లేం కర్మ, డీఈవోనే సలాం కొడతాడు” అంటి.

“అట్లయితే నువ్వా ఎలక్సన్లలో నిలబడు నాయినా” అనె వాడు సడెన్‌గా.

“ఏందివాయ్ నువ్వు జెప్పేది, ఎలక్సన్లలో నిలబడల్లంటే తమాసా మాటలనుకుంటివా?” అని ఇంగోతూరి కసురుకుంటి.

“తమాసానో గిమాసానో నాకు తెల్దు నువ్వా నిలబడు, నన్ను ఇబ్బుడు కొడతాండే మా ఐవార్లు నీకూ నమస్కారం పెట్టల్ల” అనె వాడు.

“ఎలక్సన్లలో నిలబడల్లంటే మాటలనుకుంటివ్వా? నోర్మూసుకోని పో” అని అరిస్తి.

"అవంతా నాకుతెల్దు ఇంతకుముందు మనింటికి వొచ్చిండే ఆయప్ప మాదిర్తో నువ్వూ ఎలక్సన్లలో నిలబడల్సిందే" అనె మొండికేసినట్లు.

"ఎలక్సన్లలో నిలబడల్లంటే మనకు ఎవురైనా టికెట్టు ఇయల్లప్పా, ఆయప్ప కంటే చెంద్రబాబు ఇచ్చిండాడు" అని మెల్లిగా చెప్తి.

"అట్లనా" అనె తలూపుతా.

"అంతేకాదు, తక్కవలో తక్కవగా కనీసం నాలుగుకోట్లన్నా వుండల్ల మనదెగ్గిర, అర్తమయిందా" అంటి ప్యాంటూ, చొక్కాయి తొడుక్కుంటా.

"అర్తమయిండాదిలే" అన్నెట్లుగా తల వూపె.

"అది సరేగనీ ఇబ్బుడు రోంచేపు పొణుకోని మూడు గంటలకాడ లేసి రేపు పరీచ్చకు  సదువుకో, దండిగా మార్కులు తెచ్చుకుంటే నువ్వడిగిండే ఎలీకాప్టర్ బొమ్మ తీసిస్తాగనీ" అని టాటా చెప్పి ఆపీసుకు ఎల్లబార్తి.

సందకాడ ఆరు గంటల టయింలో ఆపీసునుండీ ఇంటికి వొస్తానే నాకోసమే కాసుకోన్నెట్లుగా మా పిల్లనాకొడుకు పరిగెత్తుకుంటా ఎదురొచ్చె.

"ఏమిరా, అట్ల గస పోసుకుంటా వొస్తాండావ్?" అనడిగితి.

మూతమూసిండే ఈటా సబ్బుల అట్టపెట్టి నా చేతుల్లో పెట్టె.

"ఏముందిరా దీంట్లో ?" అనడిగితి అనుమానంగా చూస్తా.

"నువ్వు ఎలక్సన్లలో నిలబడేదానికి" అనె మెల్లిగా నవ్వతా.

"మన వంశంలో ఎవురికీలేంది నీకెట్లపట్టుకున్నిందివాయ్ ఈ ఎలక్సన్ల పిచ్చి, దీంట్లో ఏముందో మరేదగా చెప్పు?" అంటి కోపంగా.

"నువ్వే చూడు" అనె కొడతానేమోనని బయంగా చూస్తా పక్కకు జరిగి.

అట్టపెట్టి మూత తీసి లోపల వుండే వాటిని చూసి నాకేం అర్తంకాలా.

"ఏంటివిరా ఇవి?" అనడిగితి.

"ఎలక్సన్లలో నిలబడల్లంటే ఇవి కావల్లని అంటివిగదా, అందుకే రెడీ చేసినా" అనె.

ఇంతకూ పెట్టిలో ఏముండాయో మీకు ఇంగా అర్తంగాలా?

దాంట్లో వొగ బస్సు టికెట్టు, సలికాలంలో నేనూ, నాపెండ్లాం, నా ఇద్దురు కూతుర్లూ, మా పిల్ల నాకొడుకు తొడుక్కునే ఐదు సలికోట్లు పెట్టిండాడు, మా తిక్కనాకొడుకు చాస్టలకు నవ్వల్లనో ఏడ్చల్లనో మీరే చెప్పండప్పా....

✡

# సాములోరిపూజ

"ఏం సుబ్బన్నా, చానా సేపుట్నుంచీ కనిపించలా, యాడికి పొయ్యిం టివి?" అనడిగితి అబ్బుడే బయటినుండీ ఆపీసులోకి వొచ్చిన మా అటెండర్ సుబ్బన్నను. "మేనేజరు సారు వారం దినాల తర్వాత మల్లా ఈ పొద్దే ఆపీసులో జాయిన్ అయినాడు సా, పొయ్యి పలకరించొస్తాండా" అనె సుబ్బన్న.

"అట్లనా, అయితే నేనుగుడా పొయ్యి పలకరించొస్తా వుండప్పా" అంటా మిద్ది మింద వుండే మేనేజర్ రూంలోకి పోతి.

"రాప్పా, కుచ్చో" అనె ఆయప్ప ఎదురుగ్గా వుండే కుర్చీ చూపిస్తా.

"ఎట్లుంది సా ఇబ్బుడు మీ ఆరోగ్గెం?" అని అడిగితి.

"కొంచిం పర్వాలేదు, జొరం వొగ రవ్వ కాస్తానేవుండాది" అనె మేనేజరు నీర్సంగా.

"ఈ వారం దినాలకే చానా తగ్గిపోయ్యిండావు సా" అంటి.

"కరెక్టేప్పా, వారం దినాలుగా మాత్తర్లు తప్ప సరైన తిండి లేదుగదా, అందుకే" అనె.

"మందులు ఇంగా ఎన్ని దినాలు వాడల్ల సా?" అనడిగితి.

"రొండు దినాలు వాడమని చెప్పిండాడు డాక్టరు" అనె ఆయప్ప.

"అట్లనా, ఇంటికాడ్నే వుండి పూర్తిగా తగ్గేదంకా రెస్టు తీసుకోరాదా, ఈడ ఏం పాసిపోతాందని అంత బిరీనా వొచ్చిండారు?" అనంటి.

"నీకు తెలీనిదేముండాది చెప్పు మన పై ఆపీసర్ల కత, ఇబ్బుడికే హెడ్డాపీసునుండీ ఎబ్బుడొస్తాండావని పదితూర్లు పోన్లొచ్చిండాయి" అనె కొంచెం యాస్టపోతా.

"సర్లే వొస్తా సా, పని దండిగుండాది చేసుకోవల్ల" అంటి లేస్తా.

"కుచ్చోబ్బా, పోదూగనీ, కాపీ తెమ్మని చెప్పిండా" అనె.

"నేరుగా ఇంటికాడ్నుంచే వొస్తాండా సా, వొచ్చేటబ్బుడే తాగేసొస్తి, మల్లా ఏంటికి" అని చెప్తి.

"కాపీ ఎన్నితూర్లు తాగితే ఏమైతాదిలే, కుచ్చో పోదూ" అంటా ఎల్లబా రేటోన్ని నిలబెట్టె.

"ఇంగేం సా, ఇంటికాడ మేడమూ, పిల్లోల్లూ, అంతా బాగుండారుగదా" అనడిగితి.

"అంతా బాగుండారు, మా పెద్ద పాపకు కూతురు పుట్టిండే సంగతి తెలుసుగదా" అనె టేబులు మిందుండే కాయితాలు సర్దుకుంటా.

"తెలుసు సా, మీ కూతురు, మనమరాలూ ఎట్లుండారు?" అంటి.

"కరువులో అదికమాసమన్నెట్లుగా మా పాప కానుపు టయింలోనే నేనుగుడా జొరంతో మంచాన బడితి, మా భార్యకు నన్ను జూసుకునేదానికే సరిపాయ" అనె మేనేజరు మల్లా నీర్సంగా నవ్వతా.

"ఔ సా, నాకు తెలిసీ ఎబ్బుడూ మంచాన బడ్సోనివిగాదే, నీకు జొర మెట్లొచ్చె?" అనడిగితి అనుమానంగా చూస్తా.

"ముందు శనివారం నాడు వొల్లునొప్పులూ, జొరం వొచ్చినట్లనిపించె, చూపిచ్చు కుందామని డాక్టర్ దెగ్గిరికి పోతి, ఆయప్ప రక్తం పరీచ్చ చేపిచ్చుకో మనిచెప్పె, తీరా చూస్తే మలేరియా అని తేలె" అనె నిట్టూరుస్తా అటెండర్ తెచ్చిండే  కాఫీ తాగుతా .

"నిజమే సా, రొండు వారాలుగా ఎవురికిజూసినా మలేర్యా, టైపాయిడ్ జొరాలే వొస్తాండాయి, సీజన్ మారిండాదిగదా, కొంచిం జాగర్తగా వుండల్ల" అంటి.

"మన ఆపీసులో వుండే చీటీగలు, దోమల వల్లనే నాకీ జొరం వొచ్చిండేది" అనె మేనేజరు.

"అట్లనా సా, మొన్న కురిసిండే వానలకు మన ఆపీసు చుట్టూ గెడ్డి, పిచ్చి చెట్లూ దండిగా మొల్చిండాయి, వాటివల్లనే దోమలు పెరిగినట్లుండాయి" అంటి అటెండర్ ఇచ్చిండే కాపీ వూదుకుంటా తాగుతా.

"కిటికీలకు కర్టెను గుడ్డలు కుట్టిచ్చినా, రోజుకు రొండుతూర్లు రూమంతా హిట్టు గొడతాండా, అయినా ఈ దోమలు పోవడంలేదుగదప్పా ఏం చేయల్లనో" అనె మేనేజరు యాస్టపోతా.

"అట్లయితే ఈ దోమల బెడద వొదలల్లంటే మా సంబేపల్లి పుల్లంరాజు మామ చెప్పిండేటట్లు చెయ్యల్ల సా" అని లేస్తి.

"ఏం చెయ్యల్లనొ చెప్పి పున్యం గట్టుకోరాదా" అనెడిగె ఆయప్ప.

"ఏం లేదు సా, రొంత లెక్క కర్చు ఐనా పర్వాలేదనుకుంటే అయ్యప్ప మాల ఏసుకోనుండే పదిమంది సాములను పిలిపిచ్చి రొండుదినాలు సందకాడ మన ఆపీసులో పూజబెట్టిస్తే సరి" అంటి లేస్తా.

"ఆపీసులో దోమలకూ, నువ్వు చెప్తాండే అయ్యప్ప సాముల పూజకూ ఏం సంబందమో నాకు అర్తంగాలా" అనె మేనేజరు నాకల్లా చిత్రంగా చూస్తా.

"దీంట్లో అర్తం గానిదేముండాది సా, అంటి మెల్లిగా నవ్వతా.

"ఎట్లనో చెప్పు?" అనె.

"వాల్లను పిల్చుకోనొచ్చి పూజ బెట్టిస్తే సాములు బజన జేసేటప్పుడు కొట్టే సప్పట్లకు సగం దోమలు వాల్ల చేతుల్లోబడి సస్తాయి, మిగతాటివి వాల్లు అంటిచ్చే కర్పూరం పొగకు కింద రాలిపడి సస్తాయి, పున్యానికి పున్యం గూడా వొస్తాది, ఐదు నూర్లు కర్చు అయితాది, నాది గ్యారంటీ, సాముల్ను పిల్చమంటావా సా?" అనడిగితి.

మా మేనేజరు నోట్లో మాట రాలా, నేనేమన్నా తప్పుగా చెప్పిండానేమో మీరే చెప్పండప్పా....

(సరదా కోసం రాసిందే తప్ప ఎవరినీ నొప్పించడానికి కాదని మనవి చేస్తూ, అయ్యప్ప భక్తులకు క్షమాపణలతో .... )

✡

# బిరియానీ

“ఏంబా, మీ ఫ్రెండు చంద్రారెడ్డీ వాళ్ల పిల్లోనికి పుట్టిన పండగ చేస్తాండారంట, నిన్ను రమ్మని పిల్చేసిపొాయ” అని చెప్పె నాపెండ్లాం నిన్న సందకాడ ఆపీసు నుండీ ఇంటికి వొస్తానే.

“నాయినా నేనూ నీ ఎనకంబడీ వొస్తా , నన్నూ పిల్చకపో” అనె ఎక్కాలు సదూకుంటాండే మాపిల్లనాకొడుకు.

“కిందా పైనా మూసుకోని సదువుకోవాయ్” అని మల్లా గదురుకుంటి.

“నన్నూ పిల్చుకోని పోతేనే, ల్యాకుంటే సదూకోను” అని బెదిరిస్తా వాడు చేతిలో వుండే బుక్కు ఇసిరికొట్టె.

“వాడు ఎచ్చుల నా కొడుకులేరాబ్బా, వాని మాటలు నమ్మాకు, నువ్వ సదువుకో” అంటి.

“నాకు చెప్పకుండా నువ్వ వొగనివే పొయ్యి బిరానీ తినేసొస్తావ్” అనె మావాడు మల్లా ముక్కి మూలగతా.

“బిరానీ వుండదూ, పాడూ వుండదులేరా నాయినా, వాని మాటలు ఇని వొగతూరి కడుపుకు కూడు ల్యాకుండా పటారు పస్తు పణుకోనుండా,వాన్ని నమ్మితే చెరువు గట్టు మింద బిరాబిత్తలు నిలబడుక్కున్నె పుంగునూరు గంగమ్మ మాదిర్తో మోసపోతాం గనీ” అని చెప్తి.

“ఎబ్బుడు నాయినా?” అనెడిగె మా పిల్లోడు ముక్కులు ఎగబీలుస్తా.

“చానా ఏండ్లకు ముందులేప్పా, అబ్బుడు నువ్వ పుట్టిండ్లా” అంటి.

“ఆ కత నాకూ చెప్పు, ఇనల్ల” అనె బుక్కుల సంచి ఎగబెట్టి.

పదేండ్లకు ముందు ఎలక్సన్లప్పుడు హిందూపురంలో జరిగిండే కత చెప్పబట్టి.

వొగతూరి ఆపీసులో కుచ్చోని పని చేసుకుంటాంటే నాలుగ్గంటల టయింలో “ఏం బ్బీ బాగుండావా? అంటా వొచ్చె” నా క్లాసుమేటు చంద్రారెడ్డి.

“బాగుండాబ్బీ, లేపాక్షి చూసేదానికి వొచ్చినావా?” అనడిగితి.

“కాదురా, ఎలక్సన్ డూటీ మింద వొస్తి, ఈ వూరికే ఏసినారు డూటీ టవున్లోనే” అనె.

“మా ఇల్లు దెగ్గిరేలే, పొదాంపా, నీల్లు పోసుకోని ఏందన్నా తిందూగనీ, యా టయింలో బస్సెక్కినావో ఏమో” అంటి.

“నీల్లు, గీల్లు లేదుగనీ, ఎలక్సన్ పొద్దన్నేనే గదా ఇబ్బుడే బూతు కాడికి పోవల్ల, స్టాఫ్ అంతా వొచ్చేసింటారు” అనె తొందరిస్తా.

“నువ్వు నిదానంగా పోదూలే ఇంటికాడికి పోదాం రా మల్లా బిరీన వొచ్చేస్తూ” అంటి రమ్మని బలవంతం చేస్తా.

“నేను వొచ్చిండేది ఓట్లేసేవాల్లకు చుక్కలు పెట్టే డూటీ మింద కాదురా, ఆపీసర్‌గా వొచ్చినా, ఆడ అంతా నేనే చూసుకోవల్ల, డూటీ ఐపోతానే వొస్తాలే” అనె కొంచిం గర్వంగా ‘ఆపీసర్’ అనే మాట వొత్తి పలకతా.

“సరేరా, అన్నం తినేసి బిరీనా నీ కోసరం క్యారీ తెస్తా” అని ఎల్లబారబోతి.

“నువ్వేందిరా తిక్కల నాకొడకా, నేను ఆపీసర్ గా ఎలక్సన్ డూటీ మింద వొచ్చినా, నువ్వేంటికి క్యారీ తెచ్చేది” అనె వాడు.

“ఆపీసర్ అయితే మటుకూ వుపాసంతో డూటీ చెయ్యల్లనా కూడు తినకుండా?” అనడిగితి.

“అదిగాదురా, మనకు ఈడ అన్నీ రాజబోగాలే, మాకోసం బిరానీ వొస్తుంది నువ్వా వుండు తినేసిపోదూగనీ” అనె.

బిరానీ మాటింటానే నా నోట్లో నీల్లూరె, ‘తినేసి ఎల్లబారదాంలే’ అని ఆడనే వుండిపోతి.

“ఔ రా బిరానీ ఏంటికి వొస్తుంది, ఎవురు తెస్తారు?” అనడిగితి వాడు చెప్పేది నిజమో కాదో అర్తం గాక.

“మనమనుకుంటే అంతేవాయ్, ఎలక్సన్ ముగిసేదాకా నేను ఎంతచెప్తే అంతే, నువ్వే చూడు, ఎలక్సన్‌లో పోటీ చేసినోల్లే పోటీలు పడి పంపుతారు” అనె వాడు.

నిజమేనేమో అనుకుంటి. టయిం తొమ్మిదన్నర అవుతాన్యా ఆ దిక్కు ఎవురూ రాలా.

“రేయ్ ఇవన్నీ అయ్యేటివి కాదుగనీ పొయ్యి ఓటల్లో తినేసొస్తాం పా, మల్లా మూసేస్తే ఇబ్బంది”అంటి మెల్లిగా.

ఇంతలో ఎవురో వొగాయప్ప “నమస్తేసార్ రేపు ఈడ కాంగ్రెస్ పార్టీ తరపున ఏజెంటుగా కుచ్చుండేటోన్ని, వొగతూరి పలకరిచ్చి పోదామని వొస్తి” అంటా వొచ్చె.

“అది సరే మాకు తిండీ గిండీ అరేంజ్‌మెంట్ లేదా?” అనె మావాడు కోపగించుకుంటా.

“మా పెద్దయన మాకు అవన్నీ చెప్పలా సార్” అనె ఆయప్ప.

“ఏమట్ల?” అనడిగె మా ఫ్రెండు.

"ఈ బూతులో ఓట్లేసేవాల్లల్లో పదిమందిగుడా మా పార్టీకి ఎయ్యరు సార్, అట్లాటబ్బుడు మీకంతా ఏంటికి వూరికే కర్చు పెట్టల్ల, అందుకే మా పెద్దాయన మీకోసరం అరేంజ్ మెంట్లు ఏమీ చెయ్యలా" అనె బీడీ ముట్టిచ్చు కుంటా.

"అట్లనా" అనె మావాడు మొగం నల్లగబెట్టుకోని 'సరేలే వేరే పార్టీ వాల్లు తెస్తారు' అనె.

పదిగంటల టయింలో "నమస్తే సార్" అంటా ఇంగొౌగాయప్ప వొచ్చె.

"నువ్వు ఎవురయ్యా?" అనె మా వాడు.

"నేను రేపు తెలుగుదేశం పార్టీ ఏజెంటుగా వుండే మనిసిని సార్" అని చెప్పె ఆయప్ప.

"మమ్మల్నేం పట్టిచ్చుకునేదిలేదా,తిండి గిండి త్యాకుండా చేతులూపుకుంటా వొచ్చినావే?" అనె మావాడు కోపంగా.

"మా అన్న చెప్పలేదు గద సార్" అనె ఆయప్ప.

"డూటీ కోసం వొచ్చిండే వాల్లకు మర్యాదలు చేసుకోవడం తెలీదా మీ అన్నకు" అనె మావాడు ఇంగా కోపంగా.

"ఆ అవసరం మా పార్టీ వాల్లకు లేదు సార్, ఏంటికంటే ఈ బూతులో పడే ఓట్లలో వొగటో రొండో తప్ప మిగతావన్నీ మాకే పడతాయి, దొంగఓట్లు ఏపిచ్చుకునే అవసరం మాకులేదు, ఇంగ మీకేంటికి కర్చు చెయ్యల్ల" అని చెప్పె ఆయప్ప నగుతా.

ఆ మాటలకు మా ఫ్రెండు మొగం ఇంగా నల్లగా మాడిపాయి.

"సరే రారా నీతోపాటూ నన్ను గుడా సంపితివి, యాడన్నా బయట తినొస్తాం" అని వాన్ని బయలుదేరదీస్తి.

అప్పుటికే ఓటల్లన్నె మూసేసివుంటె కనీసం అరిటి కాయలన్నా కొనుక్కోని తిందాం అని ఎతుకుతాంటే "ఎవుర్రా మీరు, పొద్దన్నే ఎలక్సన్లు పెట్టుకోని అర్ధరాత్రి కాడ ఈదుల్లో తిరుగుతాండారు, బాంబులేసేదానికి వొచ్చినారా ఏంది, మరేదగా బిరీనా ఇండ్లకు పోతారా, జీపెక్కుతారా?" అంటా తరుముకుంటా తిడతా మింది మిందికొచ్చె వొగ పోలీసాయన.

"అదీప్పా ఆ ఎచ్చుల నాకొడుకు మాటలు ఇని ఆపొద్దు నీల్లు తాగి పటారుమని పస్తు పొణుకోనుండే కత," అని చెప్తి మా పిల్ల నాకొడుక్కు.

ఈ కత వింటానే అట్లనా అనె వాడు కిలకిలా నగుతా...

✡

# మందు

"ఏంబా, మద్యానం నీ కోసరం మీ ఫ్రెండు మిలిట్రీ ఎంగట్రోణ వొచ్చిండె" అనె నా పెండ్లాం సందకాడ ఆపీసు నుండీ ఇంటికొస్తానే.

"అట్లనా, ఎబ్బుడొచ్చినాడంట వాడు వూర్లోకి?" అనడిగితి.

"తెల్లారి నాలుగ్గంటల బండికి దిగినాడంట, ఆయన్న వొచ్చినాడని చెప్దామని నీకు పోన్ చేస్తిబ్బా, సుచ్చాప్ అనొచ్చె" అనె నా బాశాలి.

"నేనేం ఆప్ చెయ్యిలా, శార్జింగ్ అయిపొయ్యిండాది" అని చెప్తి సెల్ పోన్‌కు శార్జింగ్ పెడతా.

"కొంచిం కాపీ పెట్టీమ్మే, తాగేసి పొయ్యొస్తా, ఎన్ని దినాలాయనో వాన్ని చూసి" అంటి కాల్లూ, మొగం కడుక్కునేదానికి జలదాట్లోకి పోతా.

"నాయినా, నేనూ నీ ఎనకంబడీతో ఎంగట్రోణ మామోల్లింటికొస్తా" అనె మా పక్కింటాయమ్మి ఆడుకుంటాండే మా పిల్లనాకొడుకు.

"సందకాడ నువ్వేంటికిలే, మొబ్బు పడతాండాది, ఈ టయిం లో వొద్దుగనీ" అంటి.

"ఆ మామకు కొడుకు పుట్టినాడంటనే,నేనూ వొస్తా చూడల్ల" అనె వాడు.

"మొన్నాడు ఆదివారం గదా, నిన్నూ మీయమ్మనూ, ఇద్దర్నీ తొడకపోతాలే ఇబ్బుడొద్దు" అని కొంచిం కోపంగా చెప్తి.

దాంతో వాడు అలిగి మూతి ముడుసుకోని మొగం నల్లగా బెట్టుకుండె. "వొచ్చేటబ్బుడు వానికి "కుర్కురే ప్యాకీటు తెచ్చీబ్బా, సాలుగనీ, ఇంటికి బిరీనా తిరుక్కో మిసన్ కాడికి పొయ్యి దోసిపిండి కొట్టిచ్చుకోనిరావల్ల" అనె నా పెండ్లాం కాపీ లోటా అందిస్తా.

"సరేలే, అట్లనే తెస్తాగనీ" అంటి వుడుకుడుకు కాపీ వూదుకుంటా తాగుతా.

"ఇంగోతూరి చెప్తాండా, కింద చెదులు బట్టేదంకా ఆడనే కుచ్చోవద్దు" అనె మల్లా వాకిట్లోకొచ్చి గెట్టిగా అరుస్తా.

దాంతో నాకు యాడనో మండి "మూసుకోని లోపలికి పా, చింపుకో నుండేది ఇంగ సాలుగనీ" అని బిరిబిరా బజార్లేకి నడిస్తి.

"రా రా నాగరాజూ, బాగుండావా, మద్యానం నీ కోసరం మీ ఇంటికాడి కొచ్చింటి" అనె ఎంగట్రోణ దూరం నుండీనే నన్ను చూసి చెయ్యెత్తి పలకరిస్తా.

“నా పెండ్లాం చెప్పిందిలేరా, నేను బాగుండాగనీ,ఎన్ని దినాలాయరా నిన్ను చూసి, నువ్వెట్లుండావ్? అనడిగితి.

“నిరుడుతూరి సంకురాత్తిరి పండక్కు వొచ్చింటిగద వాయ్, మర్చిపొయ్యి నావా?” అనె నవ్వుతా.

“కొడుకు పుట్టినాడంటనే అని చెయ్యి కలుపుతా ఆయమ్మా, పిల్లోడూ ఏరీ?” అనడిగితి ఇంట్లోకల్లా చూస్తా.

“ఇంతకు ముందే పిల్లోన్ని ఎత్తుకోని మాయమ్మను తోడు బెట్టుకోని వాల్ల అమ్మగారింటికి పొయ్యిండాది” అని చెప్పె.

“కాదురా ఎంగట్రోణా, కొడుకు పుట్టినాడు, ఇబ్బుడన్నా బిరానీ పెట్టిస్తావా లేదారా పీనాశి నా కొడకా?” అంటి.

“బిరానీ ఏం కర్మరా, మందు పార్టీనే ఇస్తాగనీ” అనె వాడు .

“ఐదారేండ్లుగా చూస్తాండా, వొచ్చిండే ప్రతిసారీ ఇట్లనే చెప్తాండావ్ లేవాయ్” అని తిడితి కొంచిం కోపగించుకుంటా.

“అట్లయితే ఇబ్బుడే రారాబ్బా, మల్లా లేటెందుగ్గానీ, మిద్ది మిందికెక్కు, మంచి మిలిట్రీ రమ్ము తెచ్చినా, ఈపక్క యాడా దొరకదు” అనె.

“రమ్ము అంటాండావ్, ఇబ్బుడొద్దులేరా, వాసనొస్తే నా పెండ్లాం అరుస్తుంది” అని చెప్తి.

“కతలు చెప్పాకులే వాయ్, చిన్నబ్బుడు ఎన్నితూర్లు మనం ఎంగిలి బీడీలు, సిగిరెట్లు దిబ్బల్లో ఏరుకోని తాగి వాసన రాకుండా చింతాకు నమిలి ఇండ్లకు పోలా, ఇబ్బుడూ అట్లే చెయ్, ఎవురూ కనుక్కోరు” అనె వాడు.

“ఈ మొబ్బులో చింతాకు యాడని ఎతికేదిరా ఎంగట్రోణా, ఆదివారం పొద్దన్నే వొచ్చేస్తాలే, యాడికన్నా తోటకు పొయ్యి సందకాడ దాకా వుండే సొస్తాం, ఇబ్బుడయితే మీ యమ్మా వాల్లొస్తే నా మానం పోతాది” అంటి.

“వాల్లు ఇబ్బుడే రారులే, నువ్వేం బయపడగాకు” అని వాడు ముందు నన్ను మిద్ది మిందికి పంపిచ్చి ఎనకంబడీనే పెద్ద రమ్ము బాటిలు, నీల్ల బాటిలు, మిక్చరు, గలాసులూ ఎత్తుకోనొచ్చె.

“సరేలే వాసన రాకుండా ముక్కులకూ, తలకాయకూ రోంత అమృతాం జనం పూసుకోని పోతాగనీ, నాకు కొంచింగానేపొయ్‌రా, మల్లా బిరీనా ఇంటికి పోవల్ల” అంటి.

“ఈ మొబ్బులో పొయ్యి గుడ్లేమన్నా పెట్టల్లనేమిరా, చాన్నాల్లకు కల్సినాం, నిదానంగానే పోదూలే” అనె గలాసుల్లో రమ్ము పోసి నీల్లు కలుపుతా.

ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటా, మా చిన్నబ్బుడు ఫ్రెండ్స్ గురించి చెప్పుకుంటా గంట టయింలో సగం బాటిల్ ఖాళీ చేసేస్తిమి.

"ఎనిమిది గంటల కాడ జోబీలో సెల్ ఫోన్ మోగితే వానికి చెప్పేసి మెల్లిగా మిద్ది దిగి తూలుకుంటా ఇంటికి ఎల్లబార్తి.

దావలో మెడికల్ స్టోర్ కనిపిస్తే అమృతాంజనం బాటల్ కొనుక్కోని మొగమూ, కండ్లూ మంటబెట్టేటట్లు పూసుకోని నిదానంగా ఇల్లు చేరుకుంటి.

"బిరీనా కొంపకు రమ్మని అన్నితూర్లు చెప్తే గుడా రాకుండా యాడ సచ్చింటివి ఇంతసేపూ" అని నా పెండ్లాం ఆడెగిరి ఈడ దుంకె నా మింద.

"కొంచిం లేటయిపాయలేమ్మే, పిండి రేపు కొట్టిచ్చుకోనొస్తాగనీ" అంటి.

"అట్లైతే రేపు సద్దికూడు తిందూలే, అని అంటానే "ఔ బ్బా, ఏంది నీదెగ్గిర వాసనొస్తాండాదే" అనె ముక్కులు ఎగబీలుస్తా.

"తలకాయి నొస్తాంటే అమృతాంజనం పూసుకున్యాలేమ్మే" అంటి.

"మందు వాసన వొస్తాంటే ఏందో చెప్పి బుకాయిస్తాండావే, పిల్లోని మింద ఒట్టేసి మరేదగా నిజిం చెప్పు" అని గెట్టిగా అరవబట్టె.

పిల్లోని మింద ఒట్టంటే నిజం చెప్పక తప్పలా "ఔ మ్మే కొంచిం తాగొచ్చినా, ఇంగ రామాయనం చెయ్యగాకు, పిల్లోడు ఇంటాడు" అంటి.

"మా పిల్ల నా కొడుకువి గుడా వాల్లమ్మ మాదిరే పాము చెవులు గదా, ఎబ్బుడు ఇనేసిండాడొ, మెల్లిగా దెగ్గిరికొచ్చి" ఏం తాగినావు నాయినా?, అమ్మ ఏంటికి అరుస్తాంది?" అనడిగె.

"X X X R U M తాగొచ్చినాలేరాబ్బా" అని చెప్పేస్తి ఏం మాట్లాడ తాండానో నాకే తెలీకుండా.

"యాడన్నా సావుపో, నీకు ఈపొద్దు కూడు గుడా లేదు" అని అలిగి దుప్పటి కప్పుకోని నిగుడుకోని పొణుకుండె నా బాశాలి.

"XXXRUM అంటే ఏంది నాయినా?" అనడిగె మా అతి నాకొడుకు.

"చెప్తే నీకు అర్తం కాదులే పో నోర్మూసుకోని" అంటి.

"అయితాదిలే చెప్పు" అనె కదలకుండా.

"ఇంగ తప్పేటట్లు లేదని రోమన్ అంకెల్లో X అంటే పది అని కదా, అట్ల మూడు X X X లు అంటే ముప్పై (30) అని R U M అంటే రెగ్యులర్ యూజుడ్ మెడిసిన్ అని, అంటే నెలలో ముప్పై దినాలపాటూ రోజూ తాగేది అని అర్తం, నేను వొగదినం తాగితేనే మీయమ్మ కొట్లాడతాంది, నువ్వే న్యాయం చెప్పు" అని వాన్ని వాల్ల అమ్మ మిందికి కమ్మిస్తి.

✡

# ఋణం

"మ్మే, కొంచిం కాపీ పెట్టియ్యి, తలకాయ నొస్తాందాది" అంటి నా పెండ్లాంతో నిన్న సందకాడ ఆపీసు నుండీ ఇంటికొస్తానే.

"అంతగా ఏం పని వొంగదొబ్బిండావబ్బా, తలనొచ్చేదానికి" అనె కట్టుకునేదానికి లుంగీ అందిస్తా.

"మామూలుగా క్యాసియర్‌గా పంజేసేటోడు ఈపొద్దు శెలవబెట్టి వూరికిపొయ్యినాడంట, ఆయప్ప బదులు నన్ను కుచ్చునబెట్టిరి కవుంటర్లో" అంటి, మంచం మింద పొణుకుంటా.

"లెయ్ బ్బా, కాపీ తెచ్చిండా తాగుదూ" అనె పదినిమిసాల తర్వాత లోటా చేతికందిస్తా" వుడుకుడుకు కాపీ తాగినంక రోంచేపిటికి తలనొప్పి కొంచిం తగ్గినట్లనిపించె. చెంద్రబాబు ఒంగోలు మీటింగులో మాట్లాడేది వొస్తాంటే చూస్తా కుచ్చుంటి టీ.వీ. ముందర.

"ఇంగరోంతసేపు పొణుకోరాదా ఆ ముండనాశినం రాజికీయాలు మనకేంటిగ్గానీ" అనె నా పెండ్లాం. "నీకు సీరియల్లు చూసేదానికి టయిం అయిండాదని చెప్పుమ్మే, లేసి అట్ల బయిటికిపోతాగానీ" అంటి విసుగ్గా.

"అట్లనే అనుకో" అనె రిమోటు చేతుల్లోకి తీసుకుంటా.

"బయిటికిపొయ్యే వోపిక ల్యాక మంచం మిందనే నడుం వాలిస్తి.

"ఏం బా, కొత్త సమ్మచ్చురం వొస్తాందాది, పిల్లోనికి గుడ్డలు తెచ్చిండ గుడదా" అనె.

"కొత్త సమ్మచ్చురమంటే అదేమన్నా మన పండగటమ్మీ, ఇంగొగ రోండు వారాలకు సంకురాత్తిరి వొస్తాందాది, ఆ పండక్కు ఎట్లా అందరికీ తెచ్చు కుంటాంగదా" అంటి.

"ఇబ్బుడు పిల్లోనికి వొగనికి తెచ్చింటేయేమి" అనె.

"నాదెగ్గిర ఇబ్బుడు దుడ్లు యాడివమ్మీ?" అంటా బయిటికి ఎల్లబారేదానికి లేస్తి.

"వాని గుడ్డలకు లచ్చిలు, కోట్లవుతాయా, మగనాకొడుకు పుట్టిండేది వొగడు, వానికి గుడ్డలు తెమ్మంటే ఇన్ని రామాయిణాలు చెప్తాందావే" అనె నన్ను మింగేసేటట్లు చూస్తా.

"వానికొగనికే తెస్తే సరిపోతుంద్యా, మిగతా పిల్లోల్లకు గుడా త్యావల్ల గదమ్మే" అంటి.

"ఆడపిల్లోల్లు మాకూ గుడ్డలు తెచ్చీమని నిన్ను అడగలేదుగదా, వాల్లకు పండక్కే తెస్తూగనీ ఇబ్బుడు వానికొగనికి త్యాబ్బా, సాలుగనీ" అనె మల్లా.

"రేపు జీతాలు వొస్తే అట్లనేతెస్తాగనీ, వల్లాలోల్లా ఆయిమ్మికి వుండే బుద్ధి గూడా నీకు లేనట్లుందే,తిక్కల్ది అయినా ఆయమ్మి చెప్పినట్లుగా మనం పిల్లోల్లనందర్నీ వొగటిగానే సూడల్లబ్బా, మగపిల్లోన్ని వొగరకంగా, ఆడ పిల్లోల్లను ఇంగో రకంగా సూడగుడదు" అంటి మల్లా ఇంట్లోకొచ్చి కుచ్చుంటా.

"వల్లాలోల్ల ఆయిమ్మికి పెండ్లే గాలేదే, బిడ్డల్ను అందర్నీ వొగటిగా చూసే దానికీ, ఆయమ్మికీ ఏం సంబందమో నాకు బొత్తిగా అర్తం గాలా" అనడిగె.

"దానికి చిన్న కత వుండాదిలేబ్బా" అంటి మెల్లిగా నగుతా.

"ఆ కత ఏందో చెప్పుబ్బా, నేనూ ఇంటా" అనె.

నాలుగేండ్లకు ముందు ఎలక్సన్ల టయిం లో జరిగిండే కత చెప్పబట్టి.

ఓట్లు జరిగే రోజున ఆపీసుకు శెలవ ఇచ్చిండారు గాబట్టి మా పెద్దక్క విజ్జమ్మను సూసొస్తామని పుంగునూరుకు బయలుదేర్తి.

ఇంట్లోనుండీ బయటబడి తీరా బస్సెక్కేటయానికి మా ఎదురింటి కమ్మోల్ల పిల్లోడు ప్రెసాదు పట్టుకుండె.

"న్నో యాడికో పోతాన్నెట్లుండావుగదన్నా, ఓటేసిపోదూరా" అంటాపిల్చె.

"లేటయితుందేమోబ్బీ" అంటి.

"లేటేంగాదులేన్నా, ఒగనిమిసం వొచ్చిపో" అంటా చేతిలోవుండే బ్యాగు పెరుక్కుండె.

ఎదురింటోడు, అక్కరకు పిలిస్తే పలికేటోడు, ఆ పిల్లోన్ని ఏంటికి నిస్టూరం చేసుకోవల్లలేబ్బా అని , సరేపాబ్బీ"అని ఓటు ఏసేదానికి అయిస్కూలు కాడికి పోతి.మగోల్లకూ, ఆడోల్లకూ వొగే చోట గావడంతో లయిన్లో జనం దండిగానే నిలబడుక్కోనుండారు.

నేను ఓటేసేదానికోసం ప్రెసాదే నా చీటీ తెచ్చిచ్చె.ఎట్లా వొచ్చిండాగదాని నేనుగూడా లయిన్లో నిలబడితి.

"య్యో అంతా వరసలోనే రాండి" అంటా ఓట్లబ్బుడు కొట్లాటలు జరక్కుండా పోలీసాయప్ప కట్టె పట్టుకోని నిలబడుక్కోనుండె.

"ఏంబీ, నాకంటే ముందర చానా మందేవుండారు, చానా లేటయ్యే టట్లుందే" అంటి.

ఒగరొగరే లోపలికి పొయ్యి ఓటేసి బయిటికి వొస్తాండారు, పది నిమిసాల తరవాత నా ముందర నిలబడుక్కోనుండే వల్లాలోళ్ళ ఆయమ్మి చేతికి గుర్తు బెట్టిచ్చుకోని వోటేసేదానికి లోపలికి పాయ.ఆయమ్మి రోంత తిక్కల పాడుది.

బిరీనా వొస్తుందిలే అనుకోని ఎదురుజూస్తాంటి.

అయిదు నిమిసాలాయ, పదినిముసాలాయ, ఆయమ్మి ఎంతసేపుటికీ బయిటికి రాలా.

"ఏంజేస్తాండావుమ్మా ఇంతసేపూ, బిరీనా రాగూడదా, వూరికి పోవల్ల, బస్సొచ్చే టయిం అయితాంది" అంటి విసుగ్గా, గెట్టిగా అరుస్తా.

"వుండన్నా, ఓటెయ్యల్లగదా, తొందరబెడితే ఎట్లబ్బా" అనె ఆయిమ్మి లోపల్నుండీనే.

"ఎంతసేపాయమ్మా నువ్వు లోపలికిపొయ్యి, ఈ టయానికి ఇంగా నలుగురేసిందురే" అనె ఆడ డూటీ చేస్తాండే ఆయప్పగుడా.

"ఏం సా, సదువురాందిగదాని ఆయక్కను ఎట్లంటే అట్ల మాట్లాడ తాండావే" ఏజెంటుగా కుచ్చోనుండే శీనూ అనే ఊటుపాలెం పిల్లోడు.

వొగ పదినిమిసాల తర్వాత ఆయమ్మి మెల్లిగా బయిటికొచ్చె.మల్ల నేనుగూడా నా ఓటేసేసి వొస్తి.

బస్సెక్కుదామని బస్టాండు కాడ నిలబడుక్కోనుంటే ఆయమ్మి వాల్ల ఇంటికి పోతాండె.

"అదిగాదుమ్మా, అంతసేపు ఏంజేస్తాంటివి లోపల?" అనడిగితి.

"పేపరు మింద తొమ్మిది గుర్తులుండాయి, అన్నిటికీ ముద్ర కొట్టల్లగదన్నా, నీకు లేటయితాందని నన్ను తొందరబెడితే ఎట్లా" అనె.

"అదిగాదుమ్మా, ఏదో వొగదానికే గదా ఓటేసేది, అన్ని గుర్తులకూ అంటాండావే?" అనడిగితి అనుమానంగా చూస్తా.

"న్నో, నేనెట్లగనిపిస్తాండా నీకు, అన్ని పార్టీలోల్లూ దుడ్లిచ్చిండారు, తీసుకోనుండే అందరికీ ఎయ్యకుంటే వాల్ల "రునం'లో బోమా, అమ్మకు బిడ్డలందరూ ఎట్లనో, ఓటేసేవాల్లుగూడా దుడ్లిచ్చిండే వాల్లనందర్నీ సమానంగా సూడల్ల" అనె.

ఆయమ్మి మాటలకు నాకు నవ్వాల్నో ఏడవాల్నో అర్తంగాలా, "ఇదీ బిడ్డలందర్నీ సమానంగా చూడల్లని అయమ్మి చెప్పిండే కత" అని చెప్తి నా బాశాలికి.

"అట్లనా" అనె నా పెండ్లాం పొండ్లన్నీ కనిపించేటట్లు గెట్టిగా నగతా...

✡

# టెక్నిక్

"నాయినా, ఈ తూరి ఎండాకాలం శెలవల్లో మనం ఐద్రాబాదుకు పోదాం నాయినా" అనె మా పిల్లనాకొడుకు బడినుండీ వొస్తానే.

"ఎవురుండారప్పా ఆడ మనకు సుట్టాలు పొయ్యేదానికి?" అంటి.

"మా క్లాసోడు వాల్ల మామ పెండ్లి జరగతాంటే పొయ్యి అట్లనే జూ పార్కు సూసొచ్చినాడంట, మనమూ సూస్తాం నాయినా" అనె మావాడు.

"జూ పార్కులో ఏమేం వుండాయంట?" అని అడిగితి.

"రకరకాల కోతులూ, కొండముచ్చులూ, ఎనుగ్గొడ్లూ, ఇంగా ఏంటేం టియో సూసిండాడంట" అని చెప్పె చేతులు తిప్పతా.

"అట్లనా, వాటిని చూసేదానికే అంత దూరం పోవల్లనా దుడ్లు కర్చు బెట్టుకోని" అంటి.

"ఇంగెట్ల?" అనె ఏడుపు మొగంబెట్టి.

"నువ్వు రోజూ కోతుల్నూ, కొండముచ్చుల్నూ చూస్తానే వుండావు కదప్పా" అంటి మెల్లిగా నగతా.

"యాడ నాయినా?" అనడిగె వాడు.

"మనింట్లోనేప్పా" అంటి ఇంగ రోంచెం ఎక్కువగా నగతా .

"టీ.వీ. లోనా ?" అర్తంగానట్లు చూస్తా అడిగె.

"కాదు, వొరిజినల్‌గానే, మీయమ్మనూ, మీయక్కోల్లనూ చూస్తానే వుండావుగదా, వాల్లకూ, జూలో వుండే కోతులకూ పెద్ద తేడా ఏం వుండదులే అంటా ఇంకొంచిం గెట్టిగా నగితి.

నా పెండ్లాంవి పాము చెవులుగదా, నేననిండే మాటలు ఎట్ల ఇనేసిండాదో గానీ పొయ్యికాడ అన్నం చేసుకుంటాండేది సివంగి మాదిర్తో దుంకుతా బరబరా నా మీదికొచ్చేస వొంటికాలెత్తుకోని.

"ఏందో కూస్తివే, ఈ సారనూ ఏం కూసిండావో" అనె పొండ్లు పొట పొటా కొరకతా.

"నిన్నేమంటిమ్మే, ఏంటికంత ఇదిగా ఎగిరి దుంకతా వొస్తివి?" అనంటి అమాయకంగా మొగంపెట్టి.

"నువ్వు అనిండేదంతా నాకు ఇనపల్లేదనుకుంటివ్యా, నన్నూ, నా కూతుల్లనూ కోతులూ, కొండముచ్చులూ అంటివే" అనె రొప్పతా.

"మిమ్మల్ను కాదులేమ్మే అనింది" అంటి సర్ది చెప్పుదామని.

"మమ్మల్ను కాకుంటే ఇంగెవుర్నంటివీ, నెత్తిన చెయ్యి బెట్టుకోని చెప్పు" అనె ముక్కులు ఎగబీలుస్తా.

"మన ఎదురింటోల్లనులే" అంటి ఆయమ్మి కోపం జూసి.

"నా దెగ్గిర బుకాయించబాకు, ఎదురింటోల్లను వూరికే ఏంటికంటావ్, వాల్లింటే పొరకతో కొడతారు" అనె.

ఈ గలాటా ఇబ్బుడే తగ్గేటట్లు లేదంజెప్పి "రేయ్, ఆ రిమోటిట్లీ" అంటి మిడిగుడ్లేసుకోని చూస్తాండే మా పిల్లగానితో.

"దేనికి నాయినా?" అనెడిగె వాడు.

"నీకెందుకురా అవన్నీ, మూసుకోని చెప్పిండే పని చెయ్యి" అని గదమాయిస్తి.

వాడు బయపడి నా చేతికి రిమోటు అందిచ్చె.

"ఇంగ ఏమైతే అదయ్యిందిలే అని దైర్నం జేసి నేనూ నోరు పెద్దది జేసుకుంటి, టీ వీ సవుండు రోంత పెంచి.

మొగుడూ పెండ్లాలం ఇద్దరమూ వొగర్నొగురు తిట్టుకుంటాంటే టక్కుమని కరెంటుబాయె.

దాంతో మా నోర్లు టకీమని మూతబడె. నా బాశాలి దుప్పటి కప్పుకోని పొణుకుండె అన్నంగుడా తినకుండా.

అంతసేపూ మా వాదులాట ఇంటావుండిన మా పిల్లనాకొడుకు "నాయినా చానాతూర్లు గమనిచ్చిండా నువ్వా, మాయమ్మా కొట్లాడుకునే టప్పుడు ఏంటికి టీ.వీ. సవుండు పెంచుతావే?" అనడిగె.

"దానికొగ కత వుండాదిలేప్పా" అంటి.

"ఏందా కత, నాకూ చెప్పు ఇనల్ల" అనె మెల్లిగా.

"నేను చిన్నబ్బుడు మీచిన్నత్తోల్ల వూరు మొలకలచెరువులో ఏడో తరగతి సదూకుండేటప్పుడు మా పక్కింట్లో పకృద్దీన్ అని వొగ సాయిబు సంసారం వుండె. వాల్లింట్లొ రోజూ రాత్రి పూట రేడియో సవుండు పెద్దగా పెడతాండిరి, వొగ దినం వాల్ల కూతురు హసీనా నా లెక్కల బుక్కుకోసం వొచ్చింది. ఆయమ్మి నాతో రోంత 'జాస్తీ' క్లోజుగా వుండెలే.

"ఔ మ్మే, రేడియో అంటే మీ నాయనకు అంత ఇస్టమా, రోజూ రాత్రిపూట అంత పెద్దగా సవుండు పెట్టి ఇంటారే, నేనెట్ల సదువుకోవల్ల?" అని దబాయిస్తి ఒగ దినం ఆయమ్మిని.

దానికాయమ్మి "రేడియో అంటే ఇష్టమా పాడా, మా నాయిన రోజూ తాగొస్తాడుగదా, అప్పుడు మాయమ్మతో కొట్లాడతాడు,ఆ గలాటా బయట పక్కింటోల్లకు ఇనపడకుండా వుండల్లని మాయమ్మే రేడియో సవుండు పెంచుతుంది" అని చెప్పె.

అబ్బుడు నేర్చుకోనుండే 'టెక్నిక్కు' ఇబ్బుడు మీ యమ్మతో కొట్లాడేటప్పుడు వుపయోగిస్తాండా పక్కింటొల్లముందు మన మానం పోకుండా" అని చెప్తి.

హసీనా చెప్పిండే రేడియో 'టెక్నిక్' కత ఇంటానే మా పిల్లనాకొడుకు పక పకా నగె.

"అయితే నాయినా మనింట్లో గూడా రేడియో వుంటే బాగుండుగదా, టీ.వీ. ఐతే మద్యలో కరెంటు పోతే కొట్లాట ఆపెయ్యాల్ల" అనె మా వాడు ఆవులిస్తా.

"నువ్వు చెప్పిందీ నిజమేలే, రేడియో రేపే తెస్తాగానీ, ఇంగ పొణుకోపో, నాకూ నిద్రొస్తాంది" అంటి.

మీ ఇండ్లల్లోగూడ రేపే రేడియో తెచ్చిపెట్టుకోండప్పా అవసరం బడు తుందేమో...

✡

# అత్తా కో(డ)ళ్ళ కథ

ఈ పొద్దు కిరస్తానమోల్ల పండగ. ఆపీసుకు సేలవేగాబట్టి బిరీనా లేసి ఏంపీకల్లలేబ్బా, నిదానంగానే లేస్తాంలే అనుకోని ముసుగు కప్పుకోని పొణుకోనుండా.

బయట ఎవురో "న్నో, ఓన్నా," అని పిల్చినట్లనిపించె.

"మ్మే ఎవురో వొచ్చినట్లుండారు సూడు" అంటి నా పెండ్లాంకు ఇనిపించే టట్లుగా.

"నువ్వే సూసుకోపో నాకింగేమీ పంగలేదా" అనె ఆయమ్మి.

"అట్లంటే ఎట్లమ్మీ, ఇంగా రోంచేపు పొణుకుంటా" అంటి.

"నిన్నంతా కొండకు కట్టెలు మోసి, మోసి అలిసిపొయ్యినట్లుండావే పాపం, బారెడు పొద్దెక్కుతాన్యా లెయ్యకుండా" అని కసురుకుండె.

నా బాశాలితో గలాటాకు దిగితే బయట వుండేటోని ముందర మానం పోతాదని నేనే మూసుకోని మెల్లిగా లేసి ఇంటి ముందరికి పోతి.

"ఏం నా, ఇబ్బుడే లేసినట్లుండావే" అనె నా కోసరం వొచ్చిండే బొగ్గలోళ్ళపల్లి నర్సింలు.

"ఔ నర్సింలూ, ఏం ఇట్లొస్తివి?" అని అడిగితి.

"నాటుకోల్లు వుండాయి, తీసుకుంటావేమోనని వొస్తిన్నా" అనె సంకలో పెట్టుకోనుండే కోల్లను సూపిస్తా.

"ఈ పొద్దు ఆదివారం గూడా కాదులేప్పా, ఎందుగ్గానీ" అనె కోల్ల మాటినిపించి ఇంట్లో నుండీ వొచ్చిన నా పెండ్లాం.

"మంచి గుడ్లపెట్టకోల్లులేమ్మా, తినేదానికి యా దినమైతే ఏంగానీ" అనె వాడు.

"తీసుకుందాంలేమ్మే, ఈ పొద్దు సెలవే, ఇంటికాడనే వుంటాగదా" అంటి.

"మూడు దినాలకు ముందేగదా రొండు కేజీల కోడి కోపిచ్చి చించు కుంటివి, ఇంగా సాల్లేదా" అని గుడ్లురుముతా లోపలికి ఎల్లిపాయ.

"నాయినా, కోడి తీసుకో నాయినా, గుడ్లు పెడితే మనమూ ఎదురింటోల్ల మాదిర్తో పిల్లలు జేపిస్తాం" అని పరిగెత్తుకుంటా వొచ్చె మా పిల్లనాకొడుకు.

వాన్ని వాల్లమ్మ మిందికి ఎగదోస్తే సాల్లే పని జరుగుతుందనుకోని "అట్లయితే మీయమ్మను వొప్పిచ్చుపో కొందాం" అంటి.

ఆ పని మింద వాడు బఱ్ఱని పరిగెత్తతా ఇంట్లోకి పాయ.

"ఎట్ల ఇస్తాండావు నర్సింలూ?" అని అడిగితి.

"సానా సవకేలేన్నా , టౌన్లో మాదిరి కాదుగానీ,యా కోడి కావల్లనో సూడు" అంటా సంకలో వుండే రొండు కోల్లనూ నా కండ్లముందర ఆడిచ్చె.

"ఎంతనో చెప్పప్పా?" అని అడిగితి మల్లా.

"వొగోటి కేజీకిపైగా వుండాయి నాలుగు నూర్లు ఈపోన్నా" అనె వాడు.

"ఏం నర్సింలూ, అంత పిరింగా చెప్తాండావే?, ఆ రేటు పెట్టి కొనే దానికేనా, తినేదానికేనా, తగ్గించుకోని ఇచ్చే రేటు చెప్పప్పా" అంటి.

"ఎంతిస్తావొ నువ్వే చెప్పన్నా" అనె వాడు.

"మూడు నూర్లిస్తా" అంటి.

"అంత తక్కవకైతే ఎట్లన్నా, నాకూ గిట్టుకోవల్లగదా, ఇంగొగ యాబై ఎగేసి ఈపో, అక్కరకు పలికేమనిసివి, నీకాడ ఏం బేరం చేసేదిగానీ" అంటా రొండు కోల్లనూ వసారాలో గుంజకు కట్టేస.

మా వాడు వాల్లమ్మను వొప్పిచ్చిండాడేమో నా బాశాలిగూడా బయటి కొచ్చె.

"మున్నూటా యాబై తెచ్చీపోమ్మే" అంటి.

"ఏందబ్బా ఈ రోగం కోల్లను అంత రేటుకు మాట్లాడిండావా, నీకేమన్నా దిక్కూ,దివానం తెలిస్తాందా లేదా?" అనె నా బాశాలి.

నా పెండ్లాం రోగం కోల్లు అనే మాట అంటానే "మ్మో మీకు అక్కరగా వుంటే కొనండి, ల్యాకుంటే వొద్దుగానీ బంగారమట్లా కోల్లకు పేరుబెడతా వుండావే" అని రోషంగా మాట్లాడె.

దాంతో నా పెండ్లాం రోంత తగ్గి "ఇప్పుడు పల్లెలో రోగాలు వొస్తాండాయి గానీ వొగ కోడి సాల్లే నర్సింలూ, మాకు రెండెందుగ్గానీ" అనె.

"రొండూ మనమే తీసుకుందాంలేమ్మే, ఇంగోటి అమ్మేదానికి మల్లా యాడికి పోతాడుగానీ" అంటి.

"వుండే అణా, అడ్డగా, కోల్లకూ, తునకలకూ కర్చుబెట్టెయ్, పిల్లోల్ల పెండ్లిండ్లు ఎట్లజేస్తావో చూస్తా "అని నా పెండ్లాం మల్లా సాదించేదానికి మొదులుబెట్టె.

"మున్నూటా యాబై మిగలబెట్టే బిడ్డల పెండిండ్లు చెయ్యలేంగానీ, నువ్వు నోర్మూసుకోని ఇంట్లోకి పా" అని నేనూ కసురుకుంటి.

"నా మాట ఇనకుండా నువ్వు రొండు కోల్లు కొని అవి ఇంటి ముందర తిరిగి ఏరుగుతాంటే నేను తొయ్యనబ్బా, ఆ గబ్బంతా నువ్వే వూడ్చుకోవల్ల"

అని బెదిరిస్తా లోపలికి ఎల్లిపాయ 'నామాట ఎట్ల చెల్లదో నేనూ చూస్తా' అన్నెట్లుగా బెడిరిస్తా.

"ఎట్లజెయ్యల్లబ్బా" అని ఆలోచిస్తావుంటే ఒగ ఆలోచన తట్టె.

బిరీనా ఇంట్లేకిపొయ్యి "అదిగాదుమ్మే, కోడి పియ్యి తోసే తంటాలు నీకెందుగ్గానీ కోల్లు రెండిట్నీ సంకురాత్తిరి పండగదాకా మాయమ్మ దెగ్గిర వొదులుదాంలే, మల్లా పండగ పూట కోసుకుందాం" అంటి మెల్లిగా.

రోజూ సందు జూసుకోనో, ఏదో ఒగ సొట్టుబెట్టుకోనో మాయమ్మను ఏదో ఒగటి అనందే నిద్రబట్టని రకందిగదా నా పెండ్లా, మాయమ్మతో కోడి పియ్య తోపిచ్చే సందు దొరికింది గాబట్టి మొగమంతా పెద్దది చేసుకోని గెట్టిగా నవ్వతా రొండు కోల్లూ కొనేదానికి సంతోసంగా ఒప్పుకుండె.

నర్సింలుకు దుడ్లు ఇచ్చేదానికి బీరువా బీగాలు తీస్తా "ఇంగా మూడో, నాలుగో కోల్లుంటే తెమ్మనుబ్బా, పండక్కు పల్లెకాడ్నుండీ మాయన్ననూ, మా వదిన్నూ, మా తమ్మున్నీ, వాని పెండ్లాన్నీ గూడా పిలుస్తాం" అనె.

"సరేలేబ్బా అట్లనే చెప్తాగానీ" అంటి, ఇప్పుడికి పని జరిగిందిగదా అని.

అత్తతో(మాయమ్మతో) కోడిపియ్యి తోపిచ్చే ప్లాను ఏసిండే నాపెండ్లానికి తెలీదు పాపం, మొన్నాడు మాయమ్మ వూరికి పోతాందని, నెలరోజుల్దాకా రాదని.

దుడ్లు చేతిలొపడి నర్సింలు అట్లపోగానే చిన్న ఆలోచన వొచ్చె. మాయమ్మ వూరికి పోతానే నా పెండ్లాం చాటా, పొరక్కట్ట చేతికిచ్చి నాతో ఏమన్నా కోడి పియ్యి తోపిస్తుందేమోనని బయం పట్టుకుండె.

పరిస్తితి అదేరకంగా గనక ఒస్తే ఎట్లచెయ్యల్లనో మీరే చెప్పండప్పా...

✡

# స్వర్గం

"మొన్నట్నుండీ ఇస్కూలుకు శెలవులే కదా, మల్లా బల్లు తెరిచేదంకా ఏం చెయ్యల్లను కుంటాండావ్?" అనడిగితి మా పిల్లనాకొడుకును ఈ దినం తెల్లార్తోనే నిద్దర లేస్తానే.

"ఇంగా ఏమనుకోలా" అనె వాడు ఆవులిస్తానే.

"పొద్దు బారెడెక్కిందాకా నిగడదన్నుకోని పొణుకోకుండా దినామూ కొంచింసేపు పేపర్ సదవరాదా" అంటి.

"అట్లేలే నాయినా, ఈ పొద్దుట్నుండీ సదువుతాగనీ" అని తలకాయ వూపె.

"ఉప్పుకూ, వూరిగాయికీ రాని ఆ ముండనాశినం రాజకీయాలు తప్ప ఏముంటాయనిబ్బా పేపర్లో, వాన్ని గుడా సదవమని అంత అక్కరగా చెప్తాండావే" అంటావొచ్చె నా బాశాలి.

"మ్మే, అన్నిట్లో తలకాయి దూర్చి నా దెగ్గిర అనిపించుకోగాకు, నా నోరు బో చెడ్డదని ముందే తెలుసుగదా" అంటి.

"కుక్క నోట్లో ఎవురు తల దూరుస్తారులే" అని గొణగడం మొదులుబెట్టె.

"ముందు నువ్వు మరేదగా లోపలికి పోమ్మే, బొట్నేలు గుర్తేసే నీకేం తెలిస్తింది పేపరు విలువ" అని మల్లా కొంచిం గెట్టిగా అరిస్తి.

"నాయినా పేపర్ సదివితే ఏమొస్తుంది?" అనడిగె మా వాడు.

"దేశంలో, ప్రెపంచంలో జరుగుతాండేటివన్నీ పేపర్లో ఏస్తారుప్పా, అవి సదివితే 'నాలాడ్జీ' పెరుగుతుంది" అని చెప్తి.

"ఇన్నేండ్లనుంచీ నువ్వు సదివీ సదివీ కండ్లకు అద్దాలు తెచ్చుకున్నెట్లుగా, వాన్నిగుడా గుడ్డి నా కొడుకును చేసిందాకా వొదిలిపెట్టేటట్లులేవే" అనె నా బాశాలి మల్లా.

"ఎన్నితూర్లు చెప్పల్లమ్మే నీకు, బూడ్సు దెబ్బలేమన్నా పడాల్నా, ఈ పొద్దు యా పక్కన లేసిండావో వొగతూరి గెమనం తెచ్చుకో" అంటా ఈతూరి కొంచిం గెట్టిగానే అరిస్తి.

"మీ యమ్మ మాటలు ఇనాకుగానీ, నువ్వు ఈ దినం నుండీ పేపర్ సదువుకో రా" అని చెప్తి.

"అదిగాదుప్పా నేను చెప్పేది, మగపిల్లోడు గదా ఈ శెలవల్లో వానికి ఈత కొట్టేది నేరిపిచ్చు, వాడు సదివే ఒగటో తరగతికే అంత నాలాడ్జీ ఏంటిగ్గానీ" అనె.

"ఈత నేర్చుకోని ఇబ్బుడు వాడు యా సముద్రం ఈదల్లని, ఐనా బావుల్లో నీల్లుండేటట్లుగా యాడ వానలు పడినాయిమ్మే" అంటి.

"సరేలేబ్బా, నా మాట యాపొద్దాన్నా ఇనింటేగదా ఈ పొద్దు కొత్తగా ఇనేదానికి" అంటా లోపలికి ఎల్లిపాయ ఆయమ్మి.

"దీంట్లో ఏంటేంటివి సదవల్ల నాయినా?" అంటా పేపరు సంకలో పెట్టుకోని నా దెగ్గిరికొచ్చె మా వాడు.

"అన్నీ సదువు, నీకేంటివన్నా అర్తం గాకుంటే నన్నడుగు, చెప్తా" అనంటి చిన్న పనుంటే బయిటికి ఎల్లబార్తా.

"నాయినా, నువ్వు చెప్పినట్లుగా పేపరు సదివినా" అనె మా వాడు పదకొండు గంటలకాడ మల్లా ఇంటికొస్తానే.

"ఏమేం సదివినావు?" అనడిగితి.

"దీంట్లో కిరికెట్టు, సినిమాలు గుడా ఏసిండారు" అని చెప్పె నవ్వతా.

"అన్నీ అర్తమైనాయా?" అనడిగితి వాన్ని దెగ్గిరికి తీసుకుంటా.

"కొన్ని కాలా" అనె.

"ఏంటివిప్పా అవి?"అని అడిగితి మల్లా.

"సొర్గస్తులంటే ఏంది నాయనా?" అనె.

"ఎవురైనా బతికిన్నెప్పుడు మంచి పనులు చేస్తే పున్యం మూటగట్టుకుంటే సచ్చినంక సొర్గానికి పోతారు, వాల్లనే సొర్గస్తులంటారు, అదే చెడ్డ పనులు చేస్తే నరానికి పోతారు" అని చెప్తి.

"సొర్గం యాడుంటుంది?" అని ఇంగో కొశినీ ఏసె.

"దేవుని దెగ్గిర"అని ఏలు పైకి చూపిస్తి.

"ఆడ ఏముంటాయి?" అనె.

"ఆడికి పొయ్యిండేటోల్లు చానా సుకంగా, సంతోసంగా వుంటారు, నర కానికి పొయ్యిండేటోల్లకున్నెట్లుగా వాల్లకు ఏ కస్టాలు లేకుండా వుంటారు" అని చెప్తి.

"చింతిస్తున్నాం అంటే ఏంది?" అని మల్లా ఇంగో కొశినీ అడిగె.

"బాద పడుతున్నాం అని, చింత అంటే బాద అని అర్తం" అని ఇలావరీగా చెప్తి వోపిగ్గా.

"అట్లయితే ఎవురన్నా సచ్చిపొయ్యి సొర్గానికి పోతే వాల్ల పెండ్లాం బిడ్డలకూ, బందువులకూ, బాద ఏంటికి?" అనడిగె.

"నువ్వేం అడుగుతాండావో నాకర్తం గాలా గదరా" అని అనుమానంగా చూస్తి.

"అదిగాదు నాయినా, ఈయప్ప సచ్చిపొయ్యి సొర్గంలో సంతోసంగా, సుకంగా కస్టాలే లేకుండా వున్నెప్పుడు, ఆయప్ప ఆనందంతో వుండాడని వీల్లంతా గుడా ఆనందంగా వుండల్లగనీ బాద పడేదెందుకు" అంటా పేపర్లో వుండే 'వైకుంఠ సమారాధన' అనే దానికింద వుండే పోటో, మ్యాటరూ చూపిచ్చె.

"మీరు స్వర్గస్తులైనందుకు చింతిస్తూ శోకతప్త హృదయాలతో –ఇట్లు మీ కుటుంబ సభ్యులు" అని కొన్ని పేర్లు, పోటోలూ వుండాయి దాంట్లో.

కొంచింసేపు ఆలోచించినాక నాగ్గుడా ఇది నిజమే అనిపిచ్చె, 'ఇట్లాంటివి కొన్ని వేలు సదివిండానే, ఇన్నేండ్లూ నాకేంటికి రాలాబ్బా ఈ దవుటు?" అని గొమ్మునుండిపోతి ఏం మాట్లాడల్లనో తెలీకుండా.

"రేపూ, మాపూ అనకుండా ఏందో ఇబ్బుడే చెప్పు" అనె నా బాశాలి ఇరుక్కోనుండావ్ ఎట్ల ఇడిపిచ్చుకుంటావో చూస్తాం అన్నెట్లుగా నవ్వతా.

"ఏందో చెప్పు నాయినా" అని మా వాడు గెట్టిగా అరిచి అడుగుతాంటే 'ఇబ్బుడు తలకాయి నొస్తాండాది రేపు చెప్తాలే' అని తప్పిచ్చుకోనుండా.

ఈ యవ్వారమేందో, మావానికేం చెప్పల్లనో మీరన్నా చెప్పి నా మానం కాపాడి 'పున్యం' కట్టుకోండిప్పా...

✡

# రెడ్డితాత కథ

"క్కో, వొక్కా , రోంత కారం పొడి బదులీక్కా, రేపొరం మా మొగుడు సరుకులు తెస్తానే ఇచ్చేస్తా" అంటా వొచ్చె తెల్లార్తోనే మా ఎదురింటాయమ్మ.

"రా లచ్చిందేవీ, ఇస్తాగనీ" అని పిల్చె నా పెండ్లాం ఆయమ్మను.

"ఏం కా, ఈ దినం ఆదారం గదా, ఏం కూర? చికినా, మటనా?" అనెడిగె ఆయమ్మ.

"ఏమోనమ్మా, ఎనిమిది గంటల పొద్దయితావుండాది, మా మొగోడు ఇబ్బుడే లేసిండాడు, ఏం తెస్తాడో, ఏమో" అనె నా బాశాలి నిట్టూరుస్తా.

"రాత్తిరి చానా లేటుగా పొణుకున్నెట్లుండారుగదక్కా, ఇంట్లో తెల్లార్లూ లైట్లు ఎలుగుతాండెనే" అనెడిగె ఆయమ్మా నగుతా.

"ఏంజెప్పమంటావులేమ్మా, ఆ ముండ నాశినం కంప్యూటరు తెచ్చినంక కుచ్చుంటే కింద చెదులుబట్టేదంకా దానిముందు నుంచీ లెయ్యడంల్యా, దాన్నేకట్టుకోనుంటే సరిపొయ్యిండు నా బదులు" అని యాస్టపోతాండె.

"నాకంత అదురుస్టం యాడిదిలేమ్మీ" అంటా వొస్తి బాత్రూంలోనుంచీ పొండ్లు తోంకోని.

"అన్న ఇంట్లోనే వుండాడే, వొస్తాక్కా మల్లా, కూర మాడిపోతాది" అంటా ఎల్లబారె ఆయమ్మ.

అట్ల నాలుగడుగులులేసి ఇల్లు దాటిండాదోలేదో తొంగి సూసి "మ్మే, ఏంది నువ్వు జేస్తాండేది, ఆయమ్మ వొచ్చి రోంత కారంపొడీ, రోణ్ణి చెనిగ్గింజలూ, గిన్నెడు చెక్కిరా, గ్లాసుడు నూని, కొంచిం దనాల పొడి, ఇట్ల రోజూ ఏదో వొగటి ఎత్తుకోనిపోతాంది, మల్లా రేపు తెచ్చిస్తా, వొచ్చే వారం తెచ్చిస్తా అని చెప్తాందేగానీ తెచ్చిచ్చిండేది యాపొద్దూ నేను సూడ్నేలేదే" అంటి దబాయిస్తా.

"ఇంగ సాల్లేబా, తెచ్చిస్తుందిగానీ, నీ రామాయనం సాలిచ్చు" అనె నా పెండ్లాం కాపీ గ్లాసు చేతికిస్తా.

"ఏమోమ్మీ, ముందేచెప్తాండా, ఆయమ్మ వాటం జూస్తే మా రెడ్డి తాత గుర్తొస్తాండాడు, ఎనకటి నిస్టూరం కంటే ముందు నిస్టూరమే మేలుగనీ, ఈతూరి ఏందన్నా కావల్లని వొస్తే లేదనిచెప్పెయ్" అంటి వుడుకుడుగ్గా వుండేకాపీ వూదుకుంటా తాగుతా.

"ఏందిబ్బా మీ రెడ్డితాత కత, నాకూ చెప్పు ఇనల్ల" అనె.

దానికి నా చిన్నబ్బుడు జరిగిండే కత చెప్పబడ్తి. నేను మూడో తరగతిలో వుండేటప్పుడు ఎండాకాలం శెలవల్లో రోజూ మా వూరి రెడ్డేరింటి ముందర ఆడుకుంటాంటిమి.

అబ్బుడు రెడ్డీ, కరణాల టయిం. ఆ టయింలో మా సుట్టమే రెడ్డి పంజేస్తాండె.

వొగతూరి ఆయప్ప "రేయ్ ఇట్ల రా రా" అని నన్ను పిల్చె.

"ఏం తాతా" అంటా పోతి.

"గాలోల్ల అంగిడికాడికిపొయ్యి నా మిందజెప్పి కత్తిర మార్కు సిగిరెట్లు, అగ్గిపెట్టి త్యాపో" అనె.

"దుడ్లు తాతా" అనడిగితి.

"లేవుపోవాయ్, అప్పు ఇస్తారుగనీ త్యాపో" అని కసురుకుండె. అట్లే చెప్పి తెచ్చిస్తి.

రోంచేపిటికి మల్లా "రేబ్బీ, ఇట్లరా" అని మల్లా పిల్చె సిగిరేటు వూదతా.

"చెప్పు తాతా" అంటా పోతి జారిపోతాండే నిక్కరు ఎగ్గట్టుకుంటా.

"నీకు శొంటి పప్పరమెంట్లకు పావలా ఇస్తాగనీ, వుత్తరపల్లికాడికి పొయ్యి యాటలు కోసే ఎంగటప్పను పిల్చకరాపో" అనె.

శొంటి పప్పరమెంట్ల మాట ఇంటానె నా నోట్లో నీల్లూరె. గసపోసుకుంటా పరిగిత్తాపొయ్యి తాత రమ్మంటాండాడనిచెప్పి ఎంగటప్పను పిల్చుకోనొస్తి.

"ఏం ఎంగుటూ కనిపిచ్చి చాన్నాల్లయనే?" అనడిగె తాత.

"ఏంటివో పన్లుండి రాలేదులేప్పా" అనె ఎంగటప్ప.

"నోరంతా సవ్వగా వుండాదిగానీ మంచి పొట్టేలు కోసిండావంటనే, తునకలు వొగ కేజీ పంపిచ్చు పో" అనె తాత.

"సర్లేప్పా, అంటా పొయ్యి అర్ద గంటలొ ఎంగటప్ప అలవర్ క్యారీలో తునకలు తీసుకోనొచ్చి ఇచ్చె.

"దుడ్లుప్పా" అనెడిగె ఎంగటప్ప మెల్లిగా గొణగతా.

"ఎంతరా కేజీ?" అనె తాత.

"నలబయ్యేలే సామీ" అని బదులిచ్చె ఆయప్ప.

"యాబై నోటుండాది, చిల్లర లేదుగానీ, మల్ల రాపో తీసుకుందూ" అంటా సిగిరెట్టు ముట్టిచ్చుకుండె తాత.

"అట్లనేలే, నీకాడ యాడికి పోతాయి దుడ్లు" అని ఎల్లిపాయ ఎంగటప్ప.

మల్లా నాలుగు దినాలకు రెడ్డేరింటి ముందరే పిల్లోల్లతో ఆడుకుంటాంటి.

తాత మల్లా పిల్చి "పల్లికాడికి పొయ్యి ఎంగుటూను పిల్చుకరాపో" అనె.

ఈతూరన్నా పప్పురమెంట్లకు లెక్క ఇస్తాడులేబ్బా, అనుకుంటా మల్లా పొయ్యి పిల్చుకస్తి.

"రా రా ఎంగటా, కడప నుండీ సుట్టాలు వొచ్చిండారు, మాంసం మంచిదిగా చూసి రొండు కేజీలు తెచ్చీ" అనె.

ఆయప్ప గంటలో ప్లాస్టిక్ చిత్తిలో రొండు కేజీల తునకలు తీసకచ్చె.

"రేయ్, ఇది ఇంట్లో ఇచ్చేసిరాపో" అనె తాత నాతో.

"దుడ్లు సామీ" అంటా అడిగె ఎంగటప్ప తలగోక్కుంటా .

"ఎంతీయల్ల?" అనె తాత.

"ముందు దాంతో కలిపి నూటిరబై ఇయ్యాల్లప్పా" అని చెప్పె ఎంగుటూ.

"అయ్యో అట్లనా, నీకు మొన్నటిదానికి గూడా ఇయ్యాల్లగదూ, ఇబ్బుడంతలేదు,యాబయ్యే వుండాది, ఈసారి ఆదివారం మనవల్లు, మనవరాల్లు శెలవలకు వొస్తాండారు, ఇంగో రొండుకేజీలు తెచ్చిచ్చి అంతా వొగేతూరి తీసకపో" అని నేరుగా ఇంట్లేకెల్లిపాయ.

"చేసేదేముందబ్బా, అట్లేగానీ" అంటా ఎంగటప్ప గూడా పల్లిదారి పట్టె.

ఇది జరిగిండే నాలుగు దినాలకు మల్లా ఆదివారం వొచ్చె. రెడ్డేరింటికి సుట్టాలు చానామందే దిగిరి. వాల్ల పిల్లోల్లతో నేను కుశాలగా ఆటల్లో పడితి.

తాత నన్ను మల్లా పిల్చి అరిటికాయ చేతిలోబెట్టి "ఈతూరి ఎంగుటూను పిల్చుకరాపో" అనె.

అరిటికాయ తినుకుంటా పల్లికి పోతి. "న్నో, నిన్ను తాత పిలుస్తాండాడు, రావల్లంట" అంటి ఇంటి ముందర కుచ్చోనుండే ఎంగటప్పతో.

"నీకూ, మీ తాతకూ దండం సామీ, నేను ఇంటికాడ లేనని చెప్పుపో" అనె నిస్టూరంగా.

"ఎందుకన్నా?" అనడిగితి.


"మామూలుగా ఎవురన్నా అప్పు తీసుకోనుండేటోడు ఇచ్చిండేటోనికి బయపడల్ల, నా యవ్వారం అట్ల గాకుండా ఇచ్చిండే నేనే అప్పు తీసుకోనుండే మీతాతకు బయపడాల్సొస్తాంది" అనె.

"అదిమ్మీ కత, నువ్వుగూడా ఎదురింటాయమ్మకు అవీ ఇవీ బదులిచ్చి బయపడి దాక్కునే రోజురాకుండా చూసుకో" అంటి నగుతా.


ఈ కత ఇంటానే మా పెద్దాయమ్మీ, రొండో ఆయమ్మీ పడి పడీ నగిరి 'నాయినా బలే వుందే మీ రెడ్డి తాత కత' అంటా.......

✡


నిచ్చెనమెట్లు
కథలు
వేంపల్లి రెడ్డినాగరాజు


బొమ్మలు చెప్పని
కమ్మని కథలు
పిల్లల కథలు
వేంపల్లి రెడ్డినాగరాజు


మట్టి వాసన
కవితా సంపుటి
వేంపల్లి రెడ్డి నాగరాజు


రమణీయ కథలు
(మా తెలుగు తల్లికి ఓ కథా మల్లెపూదండ)
కోపల్లె విజయప్రసాదు
వేంపల్లి రెడ్డి నాగరాజు
రాచపూటి రమేష్

# అభినందనలతో...



**డా॥పి.శ్రీనివాసకుమార్‌రాజు**
పాలగిరి శిద్దమరాజు
మెమోరియల్ ట్రస్ట్ – రాయచోటి
సమన్వయకర్త
భారతీయ జనతా పార్టీ – రాయచోటి



**గాజుల ఖాదర్‌బాషా**
మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
తెలుగుదేశం పార్టీ
రాయచోటి


















# నేను నా బాశాలి మాపిల్లనాకొడుకు
## కథలు

"ఏమోయ్, మాకంటే మరీ జూనియర్‌వైనా ముందుగానే ప్రమోషన్ కొట్టేసావు? ఇంతకీ బాస్‌ను ఎలా మేనేజ్ చేశావో మాకూ కాస్తంత చెప్పవా?" అడిగారు కొలీగ్స్ సుబ్బారావును.

"పెళ్ళిరోజు సందర్భంగా మన బాస్‌కి **'నేను నా బాశాలి మా పిల్లనాకొడుకు'** కథల సంపుటి ప్రజెంట్ చేయడం మినహాయించి నేను చేసింది ఏమీ లేదు" అన్నాడు సుబ్బారావు.

--- --- --- ---

"ఏడాదిన్నరగా ఎంతగానో బ్రతిమాలుతున్నా ఎందరినో కాదన్న ఆ రాధను నువ్వెలా ఆకట్టుకోగలిగావోయ్?" తన స్నేహితుడు వర్మను ప్రశ్నించాడు వెంకటేష్.

"మొన్నీమధ్యన ఓ పార్టీలో రాధకు **'నేను నా బాశాలి మా పిల్లనాకొడుకు'** కథల సంపుటిలోని ఓ రెండు కథలు వినిపించా, అంతే నేచేసింది" బదులిచ్చాడు వర్మ కులాసాగా నవ్వుతూ.

--- --- --- ---

"రేపు నీ పుట్టినరోజు బహుమతిగా ఓ ఖరీదైన గిఫ్ట్ తేవాలనుకుంటున్నా, ఏం కావాలో చెప్పు?" తన కూతురు కవితను అడిగాడు వాళ్ళ నాన్న రవీంద్ర.

"ఆ ఖరీదైన గిఫ్ట్‌కు బదులుగా **'నేను నా బాశాలి మా పిల్లనాకొడుకు'** కథల సంపుటిని ప్రజెంట్ చేస్తే చాలు, దాన్ని జీవితాంతం ఎంతో అపురూపంగా దాచుకుంటా" చెప్పింది కవిత.

--- --- --- ---

"బాగా మానసిక ఒత్తిడితో నలిగిపోతున్న వ్యక్తిని నువ్వెలా నవ్వించగలవు?" తనముందున్న ఓ నిరుద్యోగ అభ్యర్థిని ప్రశ్నించాడు ఇంటర్వ్యూ చేస్తున్న ఆఫీసర్.

"ఇటీవల నేను చదివిన **'నేను నా బాశాలి మా పిల్లనాకొడుకు'** కథల సంపుటిలోని కొన్ని కథల్ని చెబితే చాలండీ" ఉద్యోగం తనదేనన్న ధీమాతో నవ్వుతూ బదులిచ్చాడు అభ్యర్థి.

--- --- --- ---

"ఈ మధ్య తరచుగా గమనిస్తున్నా, నీ ఫ్రెండ్ సుధ క్లాస్ రూమ్‌లో వున్నా తనలో తనే నవ్వుకుంటోంది, ఆ అమ్మాయికి పిచ్చిగానీ పట్టిందా?" లతను అడిగాడు ప్రొఫెసర్ చంద్రశేఖర్.

"అదేం కాదండీ, **'నేను నా బాశాలి మా పిల్లనాకొడుకు'** కథల సంపుటి చదివినప్పటి నుండీ వాళ్ల ఇంట్లో కూడా దాని వరస ఇలాగే వుంటోందట" చిరునవ్వుతో జవాబిచ్చింది లత.



**ఇంకెందుకు ఆలస్యం?, మరి మీరూ ఇప్పుడే కొని చదవండి**

**'నేను నా బాశాలి మా పిల్లనాకొడుకు' కథల సంపుటి.**

మీ

## వేంపల్లి రెడ్డినాగరాజు

**మహతీకృష్ణ పబ్లికేషన్స్**, రాయచోటి